thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

రాయల్స్ విధ్వంసం.. ఆర్సీబీపై ఘన విజయం



11

# చురకలు

Published From Karimnagar, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 26 | కరీంనగర్ | ఆదివారం | 12 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహమ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ఫూలేకు సీఎం నివాళి

### ఢిల్లీ నివాసంలో ఘనంగా జయంతి.. పాల్గొన్న ఎంపీ మల్లు రవి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి ఉన్నత్యాన్ని గుర్తుచేసుకున్నారు. జ్యోతిరావు ఫూలే చిత్రపటానికి ఎంపీ మల్లు రవి కూడా నివాళులర్పించారు. సామాజిక సమానత్వం కోసం ఫూలే చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.



# దక్షిణాది గొంతు నొక్కే కుట్ర

### ఉత్తరాదిలో ఎంపీ సీట్లు పెంచేందుకు కేంద్రం ప్లాన్

## పన్నులు మనవి.. నిధులు వాళ్లకా?

- 2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన సరికాదు
- 42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్ర వద్ద పెండింగ్
- బీసీ సబ్ ప్లాన్ అంశంపై ఆలోచన చేస్తాం : డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్, ఏప్రిల్ 11:** కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన రవీంద్ర భారతి తో ఏర్పాటు చేసిన మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణలో తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది

మిగతా 2 లో

"దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షను ప్రతి ఒక్కరూ గమనించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మన దగ్గర పన్నులు వసూలు చేస్తూ ఉత్తరాదికి నిధులు ధారపోస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు డిలిమిటేషన్ పేరుతో ఉత్తరాదిలో ఎంపీ స్థానాలను పెంచి దక్షిణాది ప్రాధాన్యతను తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు. దక్షిణాది గొంతు నొక్కాలని చూస్తున్న ఈ రాజకీయ కుట్రలను బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సామాజిక మార్పు కోసం అందరూ కలిసి రావాలన్నారు."

## అక్షరాస్యతలో వెనుకబడిన తెలంగాణ



- విద్యా రంగం పూర్తిగా అస్తవ్యస్తం
- ఫూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

.. వివరాలు 3లో



## పార్లమెంట్‌లో ఆసక్తికర దృశ్యం

ప్రధాని మోదీ, రాహుల్ స్నేహపూర్వక సంభాషణ!
జ్యోతిబా ఫులే జయంతి వేడుకల్లో పరస్పరం పలకరించుకున్న నేతలు

.. వివరాలు 4లో



## వెనక్కి తగ్గని ఇరాన్

షరతులకు అంగీకరిస్తేనే చర్చలని స్పష్టీకరణ!
అమెరికా బృందం ఉపాధ్యక్షుడికి పాక్ స్వాగతం

4

## కొత్తతరం నాయకత్వం రావాలి

అరాచక పాలన అంతానికి యువత ముందుకు రావాలి



- రాబోయేవి అసెంబ్లీ ఎన్నికలు కాదు.. కేసీఆర్ ఎన్నికలే
- అబద్ధపు హామీలతో రేవంత్ సర్కార్ డబ్బా
- ఇబ్రహీంపట్నం కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

3

## నేడు ఇంటర్ ఫలితాల విడుదల




.. వివరాలు 2లో



## అమీన్‌పూర్‌లో హైడ్రా ఆపరేషన్

- రూ.15 వేల కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం!
- కోర్టు ఆర్డర్లు బేఖాతరు చేస్తూ నిర్మించిన గెస్ట్ హౌస్
- 6 అంతస్తుల భవనం నేలమట్టం

2





# అంబులెన్స్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

### ప్రమాదంలో ఇద్దరు మృతి..ఒకరికి గాయాలు

**కామారెడ్డి, ఏప్రిల్ 11:** కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న అంబులెన్స్‌ను వేగంగా దూసుకొచ్చిన ప్రైవేటు బస్సు వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న పేషెంట్ సలేహ భాను(63), అంబులెన్స్ డ్రైవర్ షేక్ సర్దార్ (35) ఘటనా స్థలిలోనే మృతి చెందారు. పేషెంట్ భర్త సైఫుల్లా ఖాన్ (76) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. సలేహ భాను ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి నుంచి ఆదిలాబాద్‌లోని స్వగ్రామానికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వెనుక నుంచి అతి వేగంగా దూసుకొచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో అంబులెన్స్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బస్సు డ్రైవర్‌పై నిర్లక్ష్యంగా వాహనం నడపడం, అతి వేగం వంటి ఆరోపణలతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ప్రమాదంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# న్యాయవాదికి బెదిరింపులు

### గాయని మంగ్లీ తదితరులపై కేసు

**హైదరాబాద్, ఏప్రిల్ 11:** తెలుగు రాష్ట్రాల్లో ఫోక్ సాంగ్స్‌తో విశేష గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ గాయని మంగ్లీ ఇప్పుడు వివాదంలో చిక్కుకున్నారు. పెట్టుబడుల పేరుతో డబ్బులు సేకరించి మోసం చేయడం, అలాగే న్యాయవాదిని బెదిరించడం వంటి ఆరోపణలపై ఆమెపై కేసు నమోదవడం సంచలనంగా మారింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసు ప్రకారం, మంగ్లీ, ఆమె సోదరుడు శివ, మరికొంత మంది కలిసి సుమారు 100 మంది నుంచి భారీ మొత్తంలో నిధులు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామని నమ్మించి ఈ డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. అయితే, కాలం గడుస్తున్నా ఎటువంటి లాభాలు ఇవ్వకపోవడం మాత్రమే కాకుండా, పెట్టుబడిగా ఇచ్చిన అసలు డబ్బును కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో వారు ఆందోళన చెందుతూ న్యాయం కోసం న్యాయవాది సుబ్బారావును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో న్యాయవాది జోక్యం చేసుకోవడంతో వివాదం మరింత ముదిరింది. బాధితుల తరపున డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీయగా, మంగ్లీ మరియు ఆమె బృందం నుంచి బెదిరింపులు వచ్చాయని సుబ్బారావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా, ఈ కేసులో దర్శకుడు వేణు ఊడుగుల పేరు కూడా వెలుగులోకి రావడం గమనార్హం. మంగ్లీ, శివ, వేణు ఊడుగుల కలిసి ఫోన్ ద్వారా తీవ్రంగా బెదిరించారని, తనను యాక్సిడెంట్ చేయించి చంపేస్తామని హెచ్చరించారని న్యాయవాది ఆరోపించారు. ఈ నేపథ్యంలో తనకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ పోలీసుల వద్ద రక్షణ కోరారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టి, మంగ్లీ, శివ, వేణు ఊడుగుల, ఇతరులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు.వరుస హిట్ పాటలతో కెరీర్‌లో దూసుకుపోతున్న మంగ్లీపై ఈ తరహా ఆరోపణలు రావడం సినీ, సంగీత రంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో నిజానిజాలు ఏవో దర్యాప్తులో తేలాల్సి ఉంది. కాగా, తన పాటలతో మంచి ఫేమ్ అందిపుచ్చుకున్న మంగ్లీ వివాదాలతో ఇమేజ్ బ్యాడ్ చేసుకుంటుంది.

### లాయర్ ఫిర్యాదుకు ప్రతిగా మంగ్లీ కేసు

సుభా సియపోగు అనే న్యాయవాది తనను వేధిస్తున్నాడంటూ నార్సింగి పోలీసులను మంగ్లీ ఆశ్రయించారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, అప్రతిష్ఠ పాలు చేస్తానని బెదిరిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగ్లీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తాను రూ.150 కోట్ల మోసానికి పాల్పడ్డానంటూ సుభా సింగబోష్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంగ్లీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. మార్చి 21న సుభా సియపోగు పేరుతో ఒక వ్యక్తి తనను పరిచయం చేసుకున్నాడని, అప్పటి నుంచి అమర్యాదగా, బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నాడని ఫిర్యాదులో వివరించారు. తనను కలవాలని సదరు వ్యక్తి తీవ్ర ఒత్తిడి చేశాడని, అందుకు నిరాకరించడంతో సోషల్ మీడియాలో, బయట అప్రతిష్ట పాలు చేస్తానని బెదిరించినట్లు మంగ్లీ ఆరోపించారు. తనకు ఎలాంటి సంబంధం లేని కరెన్సీ నోట్లు ఉన్న వీడియోలను చూపించి, మరో వ్యక్తితో కలిసి తనపై అవమానకర వ్యాఖ్యలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. తన వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతింటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మంగ్లీ ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన నార్సింగి పోలీసులు, నిందితుడు సుభా సింగబోష్‌పై బిఎన్ఎస్ సెక్షన్లు 79, 351(3) కింద కేసు నమోదు చేశారు. అయితే ఇప్పటికే మంగ్లీపై పంజగుట్ట స్టేషన్‌లో న్యాయవాది కేసు నమోదు చేశారు. దీంతో పరస్పరం కేసులు నమోదు అయ్యాయి.

# ఎక్సైజ్ కమిషనర్ తీరుతో మనస్తాపం

### ఉద్యోగానికి డిప్యూటీ కమిషనర్ రాజీనామా

**నిజామాబాద్, ఏప్రిల్ 11:** జిల్లా ఎక్సైజ్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ మధ్య వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. ఎక్సైజ్ కమిషనర్ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి దూషిస్తున్నారని డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆరోపించారు. తన 30 ఏళ్ల సేవలను వదులుకుంటూ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమం ద్వారా ప్రకటించారు. ఎక్సైజ్ కమిషనర్ మాటలతో మనస్తాపం చెంది, ఆస్పత్రి పాలైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ కమిషనర్ మాటలు, వేధింపులు తట్టుకోలేకే ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సోమిరెడ్డి తెలిపారు. బదిలీల్లో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. లోయర్ క్యాడర్ ఉద్యోగుల ముందు కమిషనర్ ఇష్టానుసారం మాట్లాడడం బాధ కలిగించిందని భావోద్వేగానికి గురయ్యారు. ఆత్మాభిమానాన్ని చంపుకొని ఉద్యోగం చెయ్యలేనంటూ ప్రభుత్వానికి డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి లేఖ సైతం రాశారు.

# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, ఏప్రిల్ 11:** తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. రిజల్ట్స్‌ని వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

# దక్షిణాది గొంతు నొక్కే కుట్ర

మొదటి పేజీ తరువాయి

అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని తెలిపారు. కుల గణన చేయకుండా నియోజకవర్గాల విభజన చేపడితే ఫలితం మరోరకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకుతున్నాయని, కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రానికి వెళితే తిరిగి రాష్ట్రానికి 37 పైసలు మాత్రమే వస్తుందని, తమిళనాడు నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 29 పైసలు, కేరళ నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 61 పైసలు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. అదే ఉత్తరాది బీహార్ నుంచి కేంద్రానికి రూపాయి వెళితే తిరిగి కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి 6.53 రూపాయలు వెళుతున్నాయని, ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి పన్నుల వాటాల రూపంలో 2.17 రూపాయలు వెళుతున్నాయని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల జరుగుతున్న వివక్ష, కేంద్రం ఉద్యమాలను కట్టడి చేస్తున్న తీరు, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఇటీవల పెద్ద ఎత్తున చర్చ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. నియోజక వర్గాల పునర్విభజనలో కుల గణన ను పరిగణలోకి తీసుకోక పోతే యావత్ భారత దేశంలోని బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని, మనకోసం మనం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రజా ప్రభుత్వం బడ్జెట్లో పెద్ద ఎత్తున ప్రజలే కేంద్రంగా నిధులు కేటాయించింది ఇదే జరిగితే తమకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని భావించి రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకికరణ ప్రయత్నం జరుగుతుందని డిప్యూటీ సీఎం హెచ్చరించారు. బహుజనులు ఏకం కావాలి ప్రజా ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ



సబ్ ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ అమల్లోకి తీసుకువచ్చింది బీసీ సబ్ ప్లాన్ డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆలోచన చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. అంతరాలు లేని సమాజం కోసం జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి, జనాభా దామాషా ప్రకారం నిధులు ఖర్చు చేసినప్పుడే సకల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. సామాజిక న్యాయం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎన్ని అవాంతరాలు వచ్చినా నిటారుగా నిలబడుతుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. భారతదేశంలో కులం అనేది వాస్తవం అధికారంలోకి రాగానే కుల సర్వే చేపడతామని మా నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ప్రకటించారు.మహాత్మ పూలే ఆలోచనలను ఏ చిన్న అవకాశం దక్కిన, ప్రతి సందర్భంలో పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కుల వివక్ష, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కుంగిపోకుండా తట్టుకొని నిలబడాలి అని ఆచరించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలబడ్డారు అందుకే మహాత్మా పూలే మహానుభావుడు అయ్యారు అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఓసి అన్ని వర్గాల పిల్లలు 12వ తరగతి వరకు ఒకే చోట చదువుకునేలా అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే 40 శాతం డైట్ 200శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామని, మన బిడ్డలు ఎవరు అర్ధాకలితో ఉండకూడదనే మంచి ఉద్దేశంతో ప్రతిరోజు నాణ్యమైన డైట్ ను అందించడమే కాదు వాటిని పర్యవేక్షించేందుకు చీఫ్ సెక్రటరీ నుంచి మండల స్థాయి అధికారి వరకు సీఎం నుంచి సర్పంచి వరకు గురుకులాలు సంక్షేమ వసతి గృహాలు సందర్శించాలి అవసరమైతే అక్కడే నిద్రించాలని నిబంధన పెట్టి ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటున్నట్టు వివరించారు. జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే 20 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం పథకం ప్రారంభిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో 15 కోట్లతో సకల సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఉచితంగా విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు.

# పారదర్శకంగానే మేడారం గద్దెల నిర్మాణం

### అవినీతిపై ఆధారాలు ఉంటే చూపాలి

### సెల్‌ఫోన్ కొనుగోళ్లపైనా కువిమర్శలు తగవు

### మంత్రి సీతక్క మరోమారు గట్టిగా జవాబు

**ములుగు, ఏప్రిల్ 11:** మేడారం సమ్మక్క– సారక్క అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడ అవినీతి జరగలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్దదెల పున: నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని అంటున్నారని.. ఆధారాలు ఉంటే చూపించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలని సూచించారు. శనివారం ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. మహేశ్ గౌడ్‌కు గట్టమ్మ దేవాలయం వద్ద మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గట్టమ్మ దేవాలయంలో మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టమ్మ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా ములుగు పట్టణ కేంద్రానికి నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. నాపై తప్పుడు ప్రచారం చేశారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో తనను ఓడించేందుకు రూ.వందల కోట్లు



ఖర్చుచేశారని, తనపై తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనను ప్రలోభాలకు గురిచేశారని.. అయినా తాను వారికి లొంగలేదని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరిగిందని... అవినీతి సీతక్క అంటున్నారని.. జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. తానెక్కడా అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రూ.11,650లకు ఫోన్లు కొంటే.. రూ.14000వేలని ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహించారు. ఇష్టానుసారంగా ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం.. చట్టపరమైన చర్యలు తప్పవు. దమ్ముంటే మీ ఆరోపణలు నిరూపించండంటూ సవాల్ విసిరారు. ములుగులో పోషణ పక్వాడ సందడి కార్యక్రమాన్ని ప్రారంభించారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల పరిస్థితి అత్యంత దయనీయమన్నారు సీతక్క. కరెంటు లేదు, తాగునీరు లేదు, కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,500 అంగన్‌వాడీలకు భవనాలే లేకపోయినా నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్పు మొదలైందదన్నారు. ఇప్పటికే రెండు వేల కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. కేవలం పౌష్టికాహారం అందించడమే కాదు.. అంగన్‌వాడీలను సకల సౌకర్యాలతో 'ప్రీ–ప్రైమరీ స్కూల్స్'గా తీర్చిదిద్దుతుంటే.. అది ఓర్వలేక కొన్ని పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు సీతక్క. ఇక సెల్ ఫోన్ల కొనుగోలుపై క్లారిటీ ఇస్తూ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఐదుగురు నిపుణులైన అధికారుల కమిటీ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా టెండర్లు నిర్వహించామని స్పష్టం చేశారు. విమర్శలు పక్కన పెట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని సీతక్క చెప్పారు.

# అమీన్‌పూర్‌లో హైడ్రా ఆపరేషన్

### రూ.15 వేల కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం!

### కోర్టు ఆర్డర్లు బేఖాతరు చేస్తూ నిర్మించిన గెస్ట్ హౌస్

### 6 అంతస్తుల భవనం నేలమట్టం

**సంగారెడ్డి, ఏప్రిల్ 11:** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను కూల్చి వేస్తోంది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ఈ భారీ ఆపరేషన్‌ను నిర్వహిస్తోంది. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా.. నిర్మాణాలు జరిపిన ఓ గెస్ట్ హౌస్‌తో పాటు, ఆరు అంతస్తుల భవనాన్ని హైడ్రా కూల్చివేస్తోంది. ఐలాపురం తండాతో పాటు గ్రామంలోని పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా ఖాళీ స్థలాలను హైడ్రా స్వాధీనం చేసుకుటోంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపురం గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే చాలా నివాసాలు వెలిశాయి. ఆ నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 860 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టింది. 863 ఎకరాల భూమి విలువ రూ.15 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఇక్కడ యథాతథ స్థితిని కొనసాగించాలని 1998 నుంచి కోర్టు ఆర్డర్లున్నా పట్టించుకోకుండా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా తొలగించింది. అలాగే ఎలాంటి





అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని తొలగిస్తోంది. ఐలాపురం తండాలో కానీ, గ్రామంలోని నివాస గృహాల జోలికి కానీ వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. కేవలం అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాలు, ఖాళీ స్థలాల స్వాధీనంపైనే దృష్టి సారించినట్లు తెలిపారు. 1998 నుంచి 'స్టేటస్ కో' కొనసాగించాలని కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ, వాటిని ఖాతరు చేయకుండా ముఖీమ్ నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా నేలమట్టం చేసింది. అలాగే అతని సోదరుడు అజీమ్ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని కూడా అధికారులు తొలంచారు. ఐలాపూర్ గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే అనేక నివాసాలు వెలిశాయి. మిగిలి ఉన్న 860 ఎకరాల ఖాళీ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా హైడ్రా ఈ ఆపరేషన్ చేపట్టింది. ఈ భూమి విలువ సుమారు రూ.15 వేల కోట్ల పైమాటే ఉందని అంచనా. కూల్చివేతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులను మోహరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులు మోహరించారు. హైడ్రా చేపట్టిన ఈ భారీ ఆపరేషన్ వల్ల వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడగలిగారు.



# పంటకొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

- సిద్దిపేట యార్డులో రైతుల ఆందోళన
- సందర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట, ఏప్రిల్ 11:** పంట కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహించారు. శనివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ని హరీశ్‌రావు సందర్శించారు. పొద్దు తిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదని హరీశ్‌రావుకి రైతులు విన్నవించారు. అన్నదాతల సమస్యలు విని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూపుతోందని ధ్వజమెత్తారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్‌లను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్‌లను అధికారులు సందర్శించాలని అన్నారు. చాలా చోట్ల కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు.. కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని ÷ర్ అయ్యారు. పలు జిల్లాల్లో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని కోరారు. బీసీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. బీసీ డిక్లరేషన్ పేరుతో రేవంత్‌రెడ్డి బీసీలను మోసం చేశారని ఆగ్రహించారు. కేసీఆర్ హయాంలో అన్ని కుల వృత్తులను ప్రోత్సహించామని చెప్పుకొచ్చారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# అక్షరాస్యతలో వెనుకబడిన తెలంగాణ

- విద్యా రంగం పూర్తిగా అస్తవ్యస్తం
- పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్




**హైదరాబాద్, ఏప్రిల్ 11:** ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం.. మహాత్మా జ్యోతిరావు పూలే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు పూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ఆ రోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతోపాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ప్రశంసించారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటు పడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు పూలే ఆశయాలకు, స్ఫూర్తికి భిన్నంగా పాలన కొనసాగిస్తోందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పుకొచ్చారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా కూడా లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు. పూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారని బండి సంజయ్ కుమార్ ప్రస్తావించారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు పూలే అని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పూలేను గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుందని అన్నారు. సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జా&ఝానాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్వాతంత్యం÷–ర రాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కీర్తించారు.

# కొత్తతరం నాయకత్వం రావాలి

- అరాచక పాలన అంతానికి యువత ముందుకు రావాలి
- రాబోయేవి అసెంబ్లీ ఎన్నికలు కాదు.. కేసీఆర్ ఎన్నికలే
- అబద్ధపు హామీలతో రేవంత్ సర్కార్ డబ్బా
- ఇబ్రహీంపట్నం కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



**హైదరాబాద్, ఏప్రిల్ 11:** ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్నికలే జరుగుతయని నాకు విశ్వాసం ఉందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి అని అడగండి. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుంటున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మీదికెళ్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏమీ లేదన్నాడు. మీ ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా మీకే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు.. కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగోట్టుకున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మీకే తెలుసనన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి కూడా రైతులకు మొక్కాలే.. తడ్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.





## వర్ణ వివక్షపై పోరాటం ఆదర్శనీయం

**సామాజిక విప్లవకారుడు పూలేకు కేసీఆర్ నివాళి**

**హైదరాబాద్, ఏప్రిల్ 11:** వర్ణ వివక్షకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన సామాజిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపన మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. భారత సమాజంలో వర్ణ, కుల, లింగ వివక్షను రూపుమాపి సామాజిక న్యాయం అందించిన దార్శనికుడు పూలే అని కొనియాడారు. సబ్బండ వర్ణాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎదగాలంటే విద్య ఒక్కటే మార్గమని పూలే చెప్పిన మాటలు ఎల్లప్పుడూ ఆచరణీయమని తెలిపారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి, మహిళా విద్య కోసం అనేక కష్టాలను ఎదుర్కొన్న గొప్ప సంకల్పం ఆయనదని ప్రశంసించారు. పూలే ఆశయాలకు అనుగుణంగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో సబ్బండ కులాల అభ్యున్నతికి కృషి చేసిందని కేసీఆర్ గుర్తు చేశారు. సాగునీరు, విద్యుత్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలతో వ్యవసాయ రంగాన్ని పటిష్టం చేశామన్నారు. గొర్రెల పెంపకం, చేపల పంపిణీ, నేతన్నకు చేయూత వంటి వృత్తి కులాల ప్రోత్సాహక పథకాలతో దళిత బహుజనులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని తెలిపారు. దీనివల్ల తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం లభించిందని చెప్పారు. ఆసరా పెన్షన్లు, బీసీ బంధు వంటి పథకాలతో వెనుకబడిన కులాల అభివృద్ధికి బాటలు వేశామని పేర్కొన్నారు. బీసీ కులాల విద్య కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ విద్యాసంస్థలు ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయి చదువును అందించామని కేసీఆర్ వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బీసీ కులాల ఆత్మగౌరవం నిలబడేలా అత్యంత విలువైన స్థలాలు, నిధులు కేటాయించి ఆత్మగౌరవ భవనాల నిర్మాణం చేపట్టామన్నారు. పూలే ఆశయాల మేరకు తాము ప్రారంభించిన ప్రగతి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో కొనసాగించాలని సూచించారు. అప్పుడే మహాత్మా పూలేకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు.

## 20న మోతెలో భారీ బహిరంగ సభ

**సభాస్థలిని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు**

**జగిత్యాల, ఏప్రిల్ 11:** జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల 20వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సందర్భంగా సభాస్థలిని పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తుల ఉమ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 20న మోతెలో కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉండబోతుందని తెలిపారు. లక్షకు పైగా జనాభాకు అనుగుణంగా సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రజాభీష్టం మేరకే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రెండున్నరేళ్లలో తెలంగాణ అస్తవ్యస్తమైందని విమర్శించారు. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. జీవన్ రెడ్డి ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదని కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని గుర్తించిన ఆయన బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. స్థానిక ప్రజలు, కార్యకర్తల అభిప్రాయంతోనే బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి వచ్చారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి మార్గదర్శనం, సూచనలతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

## గజ్వేల్ రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయండి

**పెండింగ్ పనులు పరిశీలించిన బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్**

**సిద్దిపేట, ఏప్రిల్ 11:** గజ్వేల్ అభివృద్ధికి ఈ రింగ్ రోడ్డు కీలకమైనదని.. నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. శనివారం గజ్వేల్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డును రఘునందన్ రావు పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నర్మెట్టకు వచ్చినప్పుడు అసంపూర్తిగా ఉన్నా గజ్వేల్ రింగ్ రోడ్డు వ్యవహారం గురించి వివరించానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పుడు పరిష్కరిస్తామని సభ వేదికగా చెప్పారని ప్రస్తావించారు. రింగ్ రోడ్డు పూర్తి కావడానికి 151 మీటర్ల భూ సేకరణ పెండింగ్‌లో ఉందని వెల్లడించారు. ఒక రైతుని పిలిచి ఒప్పించడంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అంతా కూడా నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు. రింగ్ రోడ్డు వ్యవహారంలో సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి తానే స్వయంగా వచ్చి పరిశీలించానని తెలిపారు. జిల్లా ఎంపీగా భూమి ఇచ్చే రైతుతో మాట్లాడి ఈ పనులపై చొరవ తీసుకుంటానని అన్నారు. ఒక వేళ రైతు భూమి ఇచ్చే వ్యవహారంలో అంగీకరించని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

## 13 నుంచి 18 వరకు అరైవ్-అలైవ్ కార్యక్రమం

**ప్రజాపాలనలో రోడ్డు భద్రతపై చైతన్యం : డీజీపీ శివధర్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 11:** రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అరైవ్–అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో ఉన్న అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అరైవ్–అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు మన దేశంలోనే జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, రోడ్డు వెంట ఉన్న వారు ఎక్కువ సంఖ్యలో మృతిచెందుతున్నారని తెలిపారు.ప్రజా సంక్షేమం, భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలుచేస్తోందని అన్నారు. గ్రామాల్లో ఉన్న ఎంపీటీసీలు, సర్పంచ్‌ల నుంచి సీఎం వరకు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించినట్లు డీజీపీ తెలిపారు. ప్రతి గ్రామంలో రోడ్ సేఫ్టీ కమిటీని 8 నుంచి 9 మందితో ఏర్పాటు చేయాలని, దానిలో విరమణ పొందిన ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఉండేలా చూడాలని సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు



సంపాదకీయం

# ఆత్మరక్షణలో కాంగ్రెస్!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ అవినీతి కొట్టుకు పోయింది. వారిని విచారిస్తామన్న కేసులు వెనక్కి పోయాయి. కాళేశ్వరం, కార్ రేసు, ధరణివంటి వన్నీ ఇప్పుడు వెనక్కి పోయాయి. పదేపదే బిఆర్ఎస్ నేతలపై అవినీతి ఆరోపణలు చేసిన సిఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా బిఆర్ఎస్ నేతల అవినీతి గురించి నిరూపించలేకపోయారు. ఇది యాదృచ్ఛికమా లేక మరేదైనా కారణం ఉందా అన్నది తెలియదు. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులపై అవినీతి అంశం తెరపైకి వచ్చింది.మంత్రులం దరిపైనా అంతో ఇంతో బురదపడుతూనే ఉంది. ప్రధానంగా మంత్రి పొంగులేటిపై విపరీతమైన ఆరోపణలు వస్తున్నాయి. వాటిని ఆయన ఖండిస్తున్నా...ప్రజల్లో నమ్మకం కలగడం లేదు. తమపై బురదజల్లుతున్నారని మంత్రులు పొంగులేటి తదితరులు అంటున్నారు. నిప్పులేనిదే పొగరాదు. ప్రభుత్వంలో ఉంటూ అవినీతి గురించి ఆరోపణలు వచ్చినప్పుడు నేరుగా స్పందించాలి. నిజనిర్ధారణ జరగాలి. ముఖ్యంగా నాదర్‌గుల్ భూములపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయన తనయుడకి భాగం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అక్కడి భూములు ప్రభుత్వానివే అయితే చర్యలు తీసుకుని ఉంటే నమ్మకం కలిగేది. కానీ అలా జరగలేదు. ఇవి ప్రభుత్వ భూములే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియా సమావేశంలో చెప్పి కంపెనీలకు వత్తాసు పలికారే గానీ రైతుల గురించి ఒక్కమాటైనా చెప్పలేదని తాజాగా రైతులు నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేతలను విమర్శించడం కాదు, రైతులకు ఏం చేస్తదో చెప్పాలని పట్టుబట్టారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయే కదా.. మీరే న్యాయం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాదర్‌గుల్ రైతులు కదంతొక్కారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు దూరమై భూపోరాటానికి దిగిన రైతు కుటుంబాలు.. శుక్రవారం మరోసారి తమ భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్‌సైన్యంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేతలను కడిగిపారేసిన నాదర్‌గుల్ రైతులు ఈుజకీయాలు చేయడం మానుకొని రైతులకు ఎలా న్యాయం చేస్తారో చెప్పాలని నాదర్‌గుల్ రైతులు కాంగ్రెస్ నేతలకు తెగేసి చెప్పారు. ప్రతిరోజూ రైతులు వంటావార్పుతో పాటు పలు రీతుల్లో నిరసన కొనసాగిస్తుండగా భూపోరాటానికి బీఆర్ఎస్ సహా వామపక్ష పార్టీలు, ఇతర ప్రజాసంఘాలు వారికి మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం సంఘీభావం తెలుపుదామని భావించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతల ఆదేశానుసారం స్థానిక నాయకులు శుక్రవారం రైతుల వద్దకు వెళ్లి సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చీరాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డిపై ఆరోపణలు గుప్పించడంతో రైతులు అడ్డుకున్నారు. రెండున్నరేండ్లుగా భూముల్లోకి వెళ్లనివ్వకుండా ప్రైవేట్ కంపెనీలు ఇబ్బందులు పెడుతుంటే ఎందుకు పట్టించుకోలేదని రైతులు నిలదీశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పెద్దల వద్దకు వెళ్తే ఎవరూ న్యాయం చేయలేదని, గోడు వినలేదని ప్రశ్నించారు. రైతులు మాటలతో ఎదురుదాడి చేయడంతో హస్తం నేతలు కంగుతిన్నారు. ఏదో అనుకుంటో ఏదో జరిగిందని వారి ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే వెనుదిరిగారు. వాస్తవానికి రైతుల్లో విభేదాలు సృష్టించేందుకే కాంగ్రెస్ నేతలు వచ్చారని పలువురు రైతులు ఆరోపించారు.ఆ కంపెనీలు వేసిన రేకుల కంచెను దాటుకొని, పోలీసులు, బౌన్సర్లను సైతం లెక్క చేయకుండా భూముల్లోకి చొచ్చుకొని వెళ్లారు. ఈ అనూహ్య పరిణామాలతో అక్కడ కొన్ని గంటల పాటు ఉద్రిక్తత నెలకొన్నది. తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌ను తీసుకొని లోపలికి పోయేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు మెయిన్ గేటు వద్దే నిలువరించారు. చాలాసేపు వాగ్వాదం చేసిన తర్వాత గేటు తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు తాళ్లు పట్టుకొని గేటుకు అడ్డుగా రక్షణ వలయంగా నిల్చున్నా రైతులు లెక్క చేయలేదు.ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి అంటూ ముందుకు తోసుకుంటూ వెళ్లారు. లోపలి వైపు ప్రైవేట్ సైన్యం గేటును అదిమిపట్టినా రైతులు పట్టువీడకపోవడంతో ఒక్కసారిగా గేటు తెరుచుకుంది. దీంతో పదుల సంఖ్యలో రైతులు లోపలికి వెళ్లి బౌన్సర్లను తరిమికొట్టారు. ఒకేసారి పెద్ద ఎత్తున రైతులు రావడంతో బౌన్సర్లు భయంతో భూముల్లోకి పరుగులు తీశారు. రెండేండ్లుగా తమల్ని తమ భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న బౌన్సర్లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతులు వారిని ఉరికించారు. ఈ క్రమంలో కొంతమంది బౌన్సర్లు గుంతల్లో పడిపోగా మరికొందరిని రైతులు పట్టుకొని దాడి చేసేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. అయితే ఎవరిపైనా దాడులు చేయొద్దని విశారదన్ మహరాజ్ వచ్చి రైతుల్ని వారించి, బౌన్సర్లను అక్కడినుంచి పంపించారు. ఆ తర్వాత రైతులు భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్ కంపెనీలు ధ్వంసం చేసిన బోర్లను, బావులను పూడ్చిన తీరును విశారదన్ మహరాజ్‌కు చూపించారు. పొలాల కోసం వేసుకున్న పైపులను కూడా ధ్వంసం చేశారని, కాలువలను లేకుండా చేశారని, కరెంటు వైర్లను తగులబెట్టారని రైతులు వాటిని చూపుతూ ఆవేదన చెందారు. చాలాకాలం తర్వాత పొలాల్లోకి వెళ్లినందుకు రైతులంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం లేదు. మొన్న వట్టినాగుల పల్లి, ఇవాళ నాదర్‌గుల్ భూముల విషయంలో ప్రభుత్వం తీరుపై అనుమానాలు ఉన్నాయి. వీటిపై నిజాలు చెప్పాల్సిన బాధ్యత సిఎం రేవంత్ రెడ్డిపై ఉంది.

# వెనక్కి తగ్గని ఇరాన్

- షరతులకు అంగీకరిస్తేనే చర్చలని స్పష్టీకరణ!
- అమెరికా బృందం ఉపాధ్యక్షుడికి పాక్ ప్రధాని స్వాగతం



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 11:** పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలను తొలగించి శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా పాకిస్థాన్ వేదికగా జరగాల్సిన అమెరికా–ఇరాన్ చర్చలపై సందిగ్ధత కొనసాగుతోంది. పాక్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం అడుగుపెట్టి గంటలు గడుస్తున్నా, ఇరాన్ ప్రతినిధులతో నేరుగా భేటీ ఇంకా సాధ్యపడలేదు. తమ డిమాండ్లను నెరవేరిస్తేనే ముఖాముఖి చర్చలకు కూర్చుంటామని ఇరాన్ భీష్మించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను తక్షణమే నిలిపివేయాలని, అక్కడ పూర్తిస్థాయి కాల్పుల విరమణ అమలులోకి రావాలని ఇరాన్ పట్టుబడుతోంది. దీనితో పాటు ఖతార్‌తో సహా ఇతర అంతర్జాతీయ బ్యాంకుల్లో స్తంభింపజేసిన తమ నిధులను అమెరికా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తోంది. ఇరాన్‌పై ఉన్న ఆర్థిక ఆంక్షలను సడలించడంతో పాటు గత యుద్ధ నష్టపరిహారాన్ని కూడా చెల్లించాలని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘెర్ గాలిబాఫ్ స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా బృందానికి నాయకత్వం వహిస్తున్న ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇస్లామాబాద్ చేరుకున్న తర్వాత పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో సుదీర్ఘంగా చర్చించారు. అంతకుముందు విమానం ఎక్కే సమయంలో వాన్స్ మాట్లాడుతూ తాము శాంతికి సిద్ధంగా ఉన్నామని, కానీ ఇరాన్ తమను తప్పుదారి పట్టించాలని చూస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించడం ఉత్కంఠ రేపుతోంది. వాన్స్ బృందంలో మాజీ అధ్యక్షుడి అల్లుడు జారెడ్ కుష్నర్, ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్ కూడా ఉన్నారు. ప్రస్తుతానికి ఇరు దేశాల ప్రతినిధులు ఒకే హోటల్‌లో విడిది చేసినప్పటికీ నేరుగా కలవలేదు. పాక్ అధికారులే అటు అమెరికా బృందంతోనూ, ఇటు ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ నేతృత్వంలోని బృందంతోనూ వేర్వేరుగా భేటీ అవుతూ రాయబారం నడుపుతున్నారు. అమెరికా ఈ షరతులపై మెత్తబడితేనే రేపు నేరుగా చర్చలు జరిగే అవకాశం ఉంది. ప్రపంచ చమురు మార్కెట్‌కు కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' పునరుద్ధరణ కూడా ఈ చర్చల ఎజెండాలో ప్రధానాంశంగా ఉంది.

### చర్చలు విఫలమైతే మరిన్ని దాడులు : ట్రంప్

**న్యూయార్క్:** ఇరాన్, అమెరికా దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్న వేళ శనివారం పాకిస్థాన్‌లో రెండు దేశాల మధ్య చర్చలకు దిగారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయన్న దానిపై యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలు జరపనున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఇరాన్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ జలమార్గాలను బ్లాక్ చేయడం తప్ప.. ఇరాన్ దగ్గర మరో అస్త్రం లేదని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలన్నది తమ డిమాండ్ అని తేల్చి చెప్పారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తామని అన్నారు. అత్యుత్తమ ఆయుధాలతో సైన్యం ఇరాన్‌పై దాడి చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇరాన్ బలగాలు సైనికంగా ఓడిపోయాయని అన్నారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని స్పష్టం చేశారు. చర్చల ఫలితంతో సంబంధం లేకుండా.. హోర్ముజ్ జలసంధి దానంతట అదే తెరుచుకుంటుందని, త్వరలోనే హోర్ముజ్ జలసంధి తెరుచుకునేలా చేస్తామని అన్నారు. కాగా, ఇరాన్‌తో చర్చల నేపథ్యంలో ట్రంప్ తన సొంత సోషల్ మీడియాప్లాట్ ఫామ్ ది ట్రూత్‌లో ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వరుస పోస్టులు పెడుతున్నారు.

# మా వద్ద నాణ్యమైన చమురు ఉంది

- కొనడానికి ముందుకు రండి: ట్రంప్ పిలుపు



**వాషింగ్టన్, ఏప్రిల్ 11:** ఇరాన్‌తో శాంతి చర్చలకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు అతిపెద్ద చమురు ఆర్థిక వ్యవస్థలైన రష్యా, సౌదీ అరేబియా కంటే తమ వద్దే ఎక్కువ చమురు ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన చమురు, గ్యాస్ ను నింపుకోవడానికి ప్రపంచ దేశాలకు చెందిన అనేక ఖాళీ చమురు ట్యాంకర్లు అమెరికా తీరం వైపు వస్తున్నాయని పేర్కొన్నారు. 'మేము మీకోసం ఎదురు చూస్తున్నాం.. త్వరితగతిన స్పందించండి' అంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడికైనా చమురు ఎగుమతి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరుదేశాల మధ్య చర్చలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో ఇరాన్ అమెరికాకు పలు షరతులు విధిస్తుండడంతో కాల్పుల విరమణ ప్రయత్నాలు ఆలస్యమవుతున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్‌కు వచ్చి నాలుగు గంటలకు పైగా అయినప్పటికీ, ఇరాన్ ప్రతినిధులతో ఇంకా ప్రత్యక్ష చర్చలు జరపలేదు. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఇప్పటికే వాన్స్‌తో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఇరాన్ అధికారుల బృందం పాక్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ, స్తంభింపజేసిన ఇరాన్ నిధుల విడుదల అనే రెండు షరతులను ఇరాన్ అమెరికా ముందు ఉంచింది. అవి అమలైతేనే చర్చలు జరుగుతాయని స్పష్టం చేసింది.



# హోర్మూజ్ దాటిన భారతీయ నౌక

### కాల్పుల విరమణ తరవాత ఇదే తొలి ప్రయాణం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** యూఎస్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక తొలిసారిగా ఒక భారత రిజిస్టర్డ్ నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఎల్‌పీజీతో బయలుదేరిన జగ్ విక్రమ్ నౌక శుక్రవారం రాత్రి జలసంధిని దాటినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో, మార్చి నుంచి ఇప్పటివరకూ హోర్ముజ్‌ను దాటిన భారత సరకు రవాణా నౌకల సంఖ్య 9కి చేరింది. అంతేకాకుండా, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. ఇవి కూడా త్వరలో హోర్ముజ్‌ను దాటనున్నట్టు తెలుస్తోంది. శనివారం మధ్యాహ్నానికి జగ్ విక్రమ్ నౌక హోర్ముజ్‌కు తూర్పున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో ప్రయాణిస్తోంది. ఈ నౌకలో సుమారు 20 వేల టన్నుల ఎల్‌పీజీ ఉన్నట్టు సమాచారం. మధ్యస్థాయి సరకు రవాణా సామర్థ్యం కలిగిన ఈ నౌక ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ కంపెనీకి చెందినది. మరికొన్ని రోజుల్లో ఈ నౌక భారత్‌కు చేరుకుంటుంది. గల్ఫ్‌లో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచీ అనేక నౌకలు హోర్ముజ్‌కు పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో నిలిచిపోయాయి. జగ్ విక్రమ్‌తో పోలిస్తే రెండింతల సామర్థ్యం ఉన్న గ్యాస్ క్యారియర్లు కూడా వీటిల్లో ఉన్నాయి. ఇక ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోని భారత నౌకల్లో ఒక ఎల్‌పీజీ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్‌జీ క్యారియర్, ఒక కెమికల్ ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటెయినర్ ట్యాంకర్లు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ట్యాంకర్లకు మరమ్మతులు జరుగుతున్నట్టు సమాచారం.

# పార్లమెంట్‌లో ఆసక్తికర దృశ్యం



- ప్రధాని మోదీ, రాహుల్ స్నేహపూర్వక సంభాషణ!
- జ్యోతిబా ఫులే జయంతి వేడుకల్లో పరస్పరం పలకరించుకున్న నేతలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 :** రాజకీయ రణక్షేత్రంలో విమర్శల బాణాలు సంధించుకునే ప్రధాన ప్రత్యర్థులు పార్లమెంటు ప్రాంగణంలో మాత్రం ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతూ స్నేహపూర్వకంగా ముచ్చటించారు. మహాత్మా జ్యోతిబా ఫులే 200వ జయంతి సందర్భంగా శనివారం పార్లమెంటులోని 'ప్రేరణా స్థల్' వద్ద నివాళులర్పించేందుకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కొద్దిసేపు ప్రత్యేకంగా సంభాషించుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. కార్యక్రమానికి చేరుకున్న ప్రధాని మోదీ తొలుత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి జేపీ నడ్డాలతో పాటు రాహుల్ గాంధీని పలకరిస్తూ ముందుకు సాగారు. అయితే, కొద్ది క్షణాల తర్వాత మళ్లీ వెనక్కి వచ్చిన ప్రధాని, రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడటం చర్చనీయాంశమైంది. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ ఇరు నేతల మధ్య తీవ్రమైన వాగ్వివాదాలు సాగుతున్న తరుణంలో, ఈ అనూహ్య భేటీకి సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇటీవలి కాలంలో విదేశాంగ విధానంపై రాహుల్ గాంధీ చేసిన విమర్శలు, వాటిని ప్రధాని తిప్పికొట్టిన తీరు రాజకీయంగా వేడి పుట్టించాయి. ట్రంప్ నిర్దేశాల మేరకే మోదీ పాలన సాగుతోందని రాహుల్ ఆరోపించగా, ఆయనను 'స్వయం ప్రకటిత రాజకుమారుడు' అంటూ ప్రధాని ఎద్దేవా చేశారు. ఇటువంటి ఘాటైన రాజకీయ వాతావరణం నెలకొన్నప్పటికీ, పార్లమెంటు ప్రాంగణంలో ఒకరినొకరు గౌరవించుకుంటూ ముచ్చటించడం భారతీయ ప్రజాస్వామ్య గొప్పతనానికి నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రోడ్డుపైనే రాత పరీక్ష

### బిహార్‌లో విద్యావ్యవస్థ దుస్థితి!

**సివాన్, ఏప్రిల్ 11:** వింతలు, వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారే బిహార్ విద్యావ్యవస్థ మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో విమానాశ్రయ రన్‌వేపై పరీక్షలు రాసి వార్తల్లోకెక్కిన అక్కడి విద్యార్థులు, ఇప్పుడు ఏకంగా రోడ్డు పక్కన కూర్చుని పరీక్షలు రాస్తూ కనిపించడం నెటిజన్లను విస్మయానికి గురిచేస్తోంది. సివాన్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సివాన్ జిల్లాలోని ఒక ప్రైవేట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు ఇటీవల పరీక్షలు నిర్వహించింది. అయితే, విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా తరగతి గదిలో వసతులు, కుర్చీలు లేకపోవడంతో యాజమాన్యం వినూత్నంగా (అయినా ప్రమాదకరంగా) ఆలోచించింది. విద్యార్థులను తరగతి గదిలో కాకుండా బయట రోడ్డుకు ఇరువైపులా కూర్చోబెట్టింది. కనీసం కూర్చోవడానికి బెంచీలు కూడా లేకపోవడంతో చాలామంది కిందనే కూర్చొని, మరికొందరు నిలబడి పరీక్షలు రాయాల్సి వచ్చింది. పక్కనే వాహనాలు హారన్లు కొడుతూ వెళ్తున్నా, జనం రాకపోకలు సాగుతున్నా.. ఆ రొద మధ్యే విద్యార్థులు తీవ్రమైన ఎండలో తలలు వంచుకుని పరీక్షలు రాశారు. ఈ దృశ్యాలపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. "బిహార్‌లో అక్షరాస్యత తక్కువగా ఉండటానికి ఇటువంటి దారుణమైన పరిస్థితులే కారణం" అని ఒకరు కామెంట్ చేయగా, "ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక ప్రైవేట్ సెంటర్లకు వెళ్తే, అక్కడ అంతకంటే హీనంగా ఉందంటూ" మరొకరు విమర్శించారు.





# చరిత్రలో నెత్తుటి పేజీ.. జలియన్‌వాలాబాగ్

## (చరిత్ర గర్భంలో ...107 వెనకటి చీకటి కోణం)

- ఎం విజయభాస్కర్, 9963068913 (విజయనగరం, మనసులోమాట)

> "ఆదివారం, 13 ఏప్రిల్ 1919న, ఒక పెద్ద తిరుగుబాటు జరగవచ్చని భావించిన డయ్యర్, అన్ని సమావేశాలను నిషేధించాడు. ఈ నోటీసు విస్తృతంగా ప్రచారం కాలేదు, మరియు చాలా మంది గ్రామస్థులు బైసాఖీ పండుగను జరుపుకోవడానికి మరియు ఇద్దరు జాతీయ నాయకులైన సత్యపాల్ మరియు సైపుద్దీన్ కిచ్లూల అరెస్టు మరియు బహిష్కరణకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి బాఘ్‌లో గుమిగూడారు . 1919 ఏప్రిల్ 13వ తేదీ ఉదయం 09:00 గంటలకు, సాంప్రదాయ బైసాఖీ పండుగ రోజున, డయ్యర్ ఇంతలో, స్థానిక పోలీసులకు జలియన్‌వాలా బాగ్‌లో జరగబోయే సమావేశం గురించి మఫ్టీ డిటెక్టివ్‌ల ద్వారా సమాచారం అందింది."





అమృత్‌సర్‌లోని హర్మందిర్ సాహిబ్ సమీపంలో ఉన్న జలియన్‌వాలా బాగ్ (తోట) లో వేలాది మంది భారతీయులు గుమిగూడారు. అక్కడ ఉన్నవారిలో చాలామంది అంతకుముందు స్వర్ణ దేవాలయంలో పూజలు చేసి , ఇంటికి వెళ్లే దారిలో కేవలం ఆ బాగ్ గుండా ప్రయాణిస్తున్నారు. ఆ బాగ్ (ఇప్పటికీ అలాగే ఉంది) 6-7 ఎకరాల (2.4-2.8 హెక్టార్ల) విస్తీర్ణంలో, పరిమాణంలో ఉన్న ఒక బహిరంగ ప్రదేశం. దీనికి అన్ని వైపులా సుమారు 10 అడుగుల ఎత్తు గల గోడలు ఉండేవి. దానిలోకి ఐదు ఇరుకైన ప్రవేశ మార్గాలు ఉండేవి, వాటిలో తాళం వేయగల గేట్లు ఉండేవి. యాత్రికులు అటుగా వెళుతుండగా, అంతకు ముందు కొన్ని రోజులుగా వార్షిక బైసాఖీ గుర్రపు పశువుల సంతకు హాజరైన రైతులు, వర్తకులతో అమృత్‌సర్ నిండిపోయింది. ఆ మధ్యాహ్నం 2 గంటలకు నగర పోలీసులు సంతను మూసివేయడంతో, దానికి హాజరైన వారిలో చాలామంది జలియన్‌వాలా బాగ్‌లోకి తరలివెళ్లారు. దీంతో, మారణకాండ ప్రారంభమైనప్పుడు అక్కడున్న వారి సంఖ్య మరింత పెరిగింది. డయ్యర్ వచ్చే సమయానికి 10,000 నుండి 20,000 మంది గుంపు గుమిగూడిందని హంటర్ కమిషన్ అంచనా వేసింది. డయ్యర్ అమృత్-సర్‌కు సీనియర్ సివిల్ అధికారి అయిన డిప్యూటీ కమిషనర్ మైల్స్ ఇర్వింగ్ , గుంపులు గుమిగూడకుండా నిరోధించడానికి లేదా వారిని శాంతియుతంగా చెదరగొట్టడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. షెడ్యూల్ ప్రకారం సమావేశం ప్రారంభమైన ఒక గంట తర్వాత, డయ్యర్ 50 మంది సైనికుల బృందంతో బాఘ్‌కు చేరుకున్నాడు. ఆ యాభై మంది వద్ద .303 లీ-ఎన్‌ఫీల్డ్ బోల్ట్-యాక్షన్ రైఫిళ్లు ఉన్నాయి. బ్రిటిష్ వారి పట్ల వారి నిరూపితమైన విధేయత కారణంగా డయ్యర్ ప్రత్యేకంగా గూర్ఖా మరియు సిక్కు జాతి సమూహాల నుండి సైనికులను ఎంచుకుని ఉండవచ్చు. అతను మెషిన్ గన్‌లతో కూడిన రెండు సాయుధ వాహనాలను కూడా తీసుకువచ్చాడు; అయితే, ఆ వాహనాలు ఇరుకైన ప్రవేశ ద్వారాల గుండా ఆవరణలోకి ప్రవేశించలేకపోయాయి.




డయ్యర్ తన సైనికులను ప్రధాన నిష్క్రమణ మార్గాలను మూసివేసి, అందుబాటులో ఉన్న ఇరుకైన నిష్క్రమణ మార్గాల ముందు ఉన్న జనసమూహంలోని అత్యంత దట్టమైన భాగాలపై కాల్పులు ప్రారంభించమని ఆదేశించాడు, అక్కడ భయపడిన గుంపులు బాగ్ నుండి బయటకు వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నాయి. సుమారు పది నిమిషాల పాటు కాల్పులు కొనసాగాయి. పురుషులు, మహిళలు, వృద్ధులు మరియు పిల్లలతో సహా నిరాయుధ పౌరులు చంపబడ్డారు. సైనికులు తమ మందుగుండు సామగ్రిలో మూడింట ఒక వంతు కాల్చిన తర్వాత కాల్పుల విరమణకు ఆదేశాలు జారీ చేయబడ్డాయి.

కాల్చిన రౌండ్ల సంఖ్య మరియు కాల్పుల కాలానికి సంబంధించి అధికారిక గణాంకాలు స్పష్టంగా లోపభూయిష్టంగా ఉన్నందున, భారత జాతీయ కాంగ్రెస్ తన స్వంత ప్రత్యేక విచారణను ప్రారంభించింది, కాంగ్రెస్ ఉదహరించిన మృతుల సంఖ్య 1,500 కంటే ఎక్కువ, సుమారు 1,000 మంది మరణించారు. భారత జాతీయవాది స్వామి శ్రద్ధానంద్ ఈ ఘటనలో 1,500 మంది మరణించినట్లు గాంధీకి లేఖ రాశారు.

### భారతదేశంలో విస్తృత ఆగ్రహం

డైయర్ తన ఉన్నతాధికారులకు తాను "విప్లవ సైన్యాన్ని ఎదుర్కొన్నానని" నివేదించగా, దానికి మేజర్ జనరల్ విలియం బెయ్‌నాన్ టెలిగ్రామ్ ద్వారా ఇలా సమాధానమిచ్చారు: "మీ చర్య సరైనది మరియు లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదిస్తున్నారు." అమృత్‌సర్ మరియు ఇతర ప్రాంతాలపై సైనిక పాలన విధించాలని ఓ'డ్వైర్ అభ్యర్థించగా, వైస్రాయ్ లార్డ్ చెమ్స్‌ఫోర్డ్ దీనిని మంజూరు చేశారు . ఆ తర్వాతి రోజుల్లో వేలాది మందిని నిర్బంధించారు, కొందరికి శిక్షా ప్రవాస శిక్ష విధించారు. ఏప్రిల్ 13 తర్వాత రోజుల్లో భద్రతా దళాల చేత కనీసం 115 మంది చంపబడ్డారు. చర్చిల్ దీనిని "వర్ణించలేని రాక్షస చర్య" అని పేర్కొనగా, ఆస్క్విత్ దీనిని "మన చరిత్ర మొత్తంలో జరిగిన అత్యంత దారుణమైన, భయంకరమైన దురాగతాలలో ఒకటి" అని అభివర్ణించారు. చాలా మంది బ్రిటన్లు ఇప్పటికీ "భారతదేశంలో బ్రిటిష్ చట్ట పాలనను కాపాడినందుకు అతన్ని హీరోగా భావించారు" అని క్లోక్ నివేదించారు. రవీంద్రనాథ్ టాగోర్ 1919 మే 22 నాటికి ఈ మారణకాండ వార్తను అందుకున్నారు. ఆయన కలకత్తాలో ఒక నిరసన సభను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించి , చివరకు "ఒక ప్రతీకాత్మక నిరసన చర్య"గా తన బ్రిటిష్ నైట్‌హుడ్‌ను వదులుకోవాలని నిర్ణయించుకున్నారు. "తమ అల్పత్వం కారణంగా మానవులకు తగని అవమానానికి గురయ్యే అవకాశం ఉన్న నా దేశస్థుల పక్షాన, నేను అన్ని ప్రత్యేక భేదాలను వదిలివేసి నిలబడాలని కోరుకుంటున్నాను." న

### డైయర్ ప్రతిస్పందన మరియు ప్రేరణ:

డైయర్ 21 జనవరి 1921న గ్లోబ్‌లో "సామ్రాజ్యానికి ప్రమాదం" అనే శీర్షికతో ఒక వ్యాసం రాశారు. అది "భారతదేశానికి స్వయం పరిపాలన వద్దు. అది దాన్ని అర్థం చేసుకోలేదు" అనే వాక్యంతో ప్రారంభమైంది. తరతరాల వరకు భారతదేశానికి స్వయం పరిపాలన పట్ల ఆకాంక్ష గానీ, సామర్థ్యం గానీ ఉండదు. భారతదేశానికి స్వయం పరిపాలన అనేది ఒక భయంకరమైన నటన. నిర్మాణాత్మక పనులకు పునాదులు పడకముందే ఇది దేశ ప్రజలను ఒకరి గొంతుకను ఒకరు కోసుకునేలా చేస్తుంది. స్వయం పరిపాలన కింద, భారతదేశం ఆత్మహత్య చేసుకుంటుంది; కానీ మన రాజకీయ నాయకులు ఆ నేరంలో భాగస్వాములుగా హత్యకు పాల్పడినట్లే అవుతారు..



# సూళ్లూరుపేట జ్యువెలరీ చోరీ కేసు ఛేదన

తమిళనాడుకు చెందిన పాత నేరస్తుడి అరెస్ట్



తిరుపతి, ఏప్రిల్ 11: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో సంచలనం రేపిన జ్యువలరీ రాబరీ కేసును పోలీసులు ఛేదించారు. తమిళనాడుకు చెందిన అంతర్రాష్ట్ర నేరస్థుడు వేల్మురుగన్ బాబు అలియాస్ పల్సర్ బాబు అరెస్టు కావడం కేసుకు కీలక మలుపు తిరిగింది. మార్చి 14న మధ్యాహ్నం సుమారు 2-30 గంటల సమయంలో శ్రీ వెంకటేశ్వర జ్యువెలరీ షాపులో కస్టమర్ వేషంలో ప్రవేశించిన నిందితుడు సినీ పక్కిలో విధంగా యజమాని వెంకటేశ్వర్లు కళ్ళల్లో కారంపొడి చల్లి 12 బంగారు గొలుసు నందు దోచుకుని పరారయ్యాడు. సుమారు 14 లక్షల విలువైన ఈ ఆభరణాలు క్షణాల్లో మాయం అవడంతో పట్టణంలో కలకలం చెల్లరేగింది. దశాబ్ద కాలంగా నేర జీవితం గడుపుతున్న నిందితుడు తమిళనాడులోనే 24 కేసుల్లో నిందితుడిగా ఉండి అందులో 16 రాబరీలు, 7 దొంగతనాలు, ఒక హత్యాయత్నం కేసులు ఉన్నాయి. పలు నాన్ బెయిల్ వారింట్ లు పెండింగ్ లో ఉండగా, తిరుపతి జిల్లాలోని పుత్తూరు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో కూడా శిక్ష అనుభవించాడు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాలతో అదనపు ఎస్పీ శ్రీనివాసులు, నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు, పర్యవేక్షణలో సూళ్లూరుపేట సి.ఐ.మురళీకృష్ణ నేతృత్వంలో ప్రత్యేక బృందం గాలింపు చర్యలు చేపట్టి, సూళ్లూరుపేట ఎస్సై జి. అజయ్ కుమార్, తడ ఎస్సై కే. కొండప్ప నాయుడు, ఏ.ఎస్.ఐ. పులిచెర్ల శ్రీ కుమార్ రెడ్డి చాకచక్యంగా ఏప్రిల్ 11 ఉదయం సత్యవేడు పట్టణంలో బిఎస్ఎన్ఎల్ సమీపంలోని మెకానికల్ షాపు వద్ద నిందితుని అదుపులోకి తీసుకుంది. నిందితుడి వద్ద నుంచి దొంగలించిన 12 బంగారు గొలుసులు నేరానికి ఉపయోగించిన స్కూటీ స్వాధీనం చేసుకోవడంతో కేసుకు పూర్తి పరిష్కారం లభించింది. నేరం ఎంత చాకచక్యంగా ఏన్నుకొన్న చట్టం కన్నుల నుండి తప్పించుకుపోవడం అసాధ్యం అనే విషయాన్ని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

# హార్బర్‌ని ప్రైవేటు పరం చేసే ప్రసక్తేలేదు

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**నెల్లూరు, ఏప్రిల్ 11:** జువ్వలదిన్నె హార్బర్‌పై పుకార్లు, అసత్య ప్రచారాలు నమ్మొద్దని.. హార్బర్‌ని ప్రైవేటు పరం చేసే ప్రసక్తేలేదని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణపట్నం పోర్టుకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారని ప్రస్తావించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 2008లో కృష్ణపట్నం నుంచి వాడరేవు వరకు ఎలాంటి పోర్టులు రాకూడదని జీవో ఎంఎస్ నంబర్- 40 ఇచ్చారని గుర్తుచేశారు. శనివారం నెల్లూరులో సోమిరెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టుపై పెత్తనం కోసం తండ్రిని అడ్డం పెట్టుకుని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవో తెప్పించారని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహించారు. పోర్టులు, హార్బర్లు, చివరకు జెట్టీలు రాకుండా చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలోనే రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌లు వచ్చాయని తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సహకారంతో హార్బర్ తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా 900 మీటర్ల జెట్టీతో హార్బర్ తెచ్చామన్నారు. బ్లూ రివల్యూషన్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.130కోట్లు, టీడీపీ ప్రభుత్వం రూ.150కోట్లు నిధులతో జువ్వలదిన్నె హార్బర్‌ని తాము తీసుకువచ్చామని తెలిపారు. జగన్ ఈ నెల 15వ తేదీన జువ్వలదిన్నెకి వస్తానంటున్నారని.. ఏమి చెప్పేందుకు జగన్ వస్తున్నారని ప్రశ్నించారు. పోర్టులు, హార్బర్‌లు, జెట్టీలు రాకుండా జీవో తెప్పించానని చెబుతావా? ఐదేళ్లుపాటు జువ్వలదిన్నె హార్బర్ పూర్తి చేయలేకపోయామని చెబుతావా? అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. వైఎస్‌ని అడ్డుపెట్టుకుని జగన్ అడ్డగోలు జీవోలు తెచ్చారని మండిపడ్డారు. జగన్ ముఖ్యమంత్రిగా పనిచేశావని... నోటికొచ్చినట్లుగా మాట్లాడవద్దని హితవు పలికారు. రూ.288కోట్ల నిధులు తాము తెస్తే... జగన్ హయాంలో నిర్మించడానికి ఐదేళ్లు పట్టిందని ప్రస్తావించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద మల్టీపర్పస్ జువ్వలదిన్నె హార్బర్‌ని మూడు నెలల్లో మత్స్యకారులకు అందజేస్తామని స్పష్టం చేశారు. జువ్వలదిన్నె హార్బర్‌కి 123 ఎకరాల భూమి ఉందని.. 200 బోట్లు వచ్చి నిలిచే అవకాశం ఉందని వెల్లడించారు. జగన్ ఏ రోజైనా ఢిల్లీకి వెళ్లి, ఒక్క ప్రజా ప్రయోజనకర జీవో తీసుకువచ్చావా? అని ప్రశ్నించారు. సాగర్ డిఫెన్స్ పరిశ్రమతో మత్స్యకారులకు అత్యాధునిక టెక్నాలజీ, ఉపాధి అందుతాయని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

# న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగింది : హోంమంత్రి

**విశాఖపట్నం, ఏప్రిల్ 11:** చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ అంటే ఒక గౌరవమని ఉద్ఘాటించారు. పోక్సో కేసుల్లో బెయిల్ రాకుండానే శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ సమన్వయంతో పని చేస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. శనివారం విశాఖపట్నంలో ఆంధప్రదేశ్ ప్రాసిక్యూషన్ విభాగం ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, బానిస కార్మిక వ్యవస్థ (రద్దు) చట్టం, 1976పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా హోంమంత్రి అనిత, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ రామకోటేశ్వరరావు, 200 మంది ప్రాసిక్యూషన్ అధికారులు పాల్గొన్నారు. వివిధ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌ను సత్కరించారు. అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడేది ఈ వర్క్‌షాప్ అని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా 900 మంది పిల్లలను రక్షించామని వివరించారు. వివిధ దేశాల్లో చిక్కుకున్న180 మందిని కూడా రక్షించామని తెలిపారు. పోలీస్ శాఖలో కూడా నూతన టెక్నాలజీతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పోలీస్ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ పటిష్ఠంగా ఉంటేనే.. ప్రజాస్వామ్యం పటిష్ఠంగా ఉంటుందని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.



# అంతరిక్ష రంగంలో భారత్ ముందంజ

## నేడు అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం




(ఈద మధుకర్ సీనియర్ జర్నలిస్ట్)

అంతరిక్ష విజ్ఞాన రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతి కేవలం ప్రయోగాలకు పరిమితం కాకుండా, ప్రపంచ యవనికపై ఒక అగ్రగామి శక్తిగా మన దేశాన్ని నిలబెడుతోంది. ఏప్రిల్ 12 "అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం" సందర్భంగా, మానవాళి సాధించిన అద్భుతాలను గుర్తుచేసుకుంటూనే, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ISRO) ప్రయాణాన్ని, దాని వెనుక ఉన్న కృషిని విశ్లేషించుకోవడం సముచితం. 1961 ఏప్రిల్ 12న సోవియట్ యూనియన్‌కు చెందిన యూరీ గగారిన్ 'వోస్టోక్-1' నౌకలో భూకక్ష్యలోకి ప్రవేశించి, అంతరిక్షంలోకి వెళ్ళిన తొలి మానవుడిగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి 50 ఏళ్లు నిండిన సందర్భంగా, 2011లో ఐక్యరాజ్య సమితి ఏప్రిల్ 12ను అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవంగా ప్రకటించింది. ఈ నేపథ్యం ప్రపంచానికి ఒక ఎత్తయితే, భారత్ సున్నా నుండి శిఖరానికి చేరుకున్న వైనం మరో అద్భుత చరిత్ర.


భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ దూరదృష్టి నేడు భారత్‌ను అంతరిక్ష దిగ్గజంగా మార్చింది. 1957లో రష్యా 'స్పుత్నిక్' ప్రయోగించినప్పుడు, అంతరిక్ష పరిజ్ఞానం కేవలం విలాసం కాదని, దేశాభివృద్ధికి అదొక అవసరమని సారాభాయ్ గుర్తించారు. హోమీ బాభా సహకారంతో 1962లో 'ఇన్కోస్పార్' (INCOSPAR) ఏర్పాటు కావడం, కేరళలోని తుంబాలో ఒక చర్చి ప్రాంగణంలో రాకెట్ ప్రయోగాలు మొదలుపెట్టడం భారత అంతరిక్ష గాథలో అత్యంత స్ఫూర్తిదాయకమైన ఘట్టాలు. సైకిళ్లపై రాకెట్ విడిభాగాలను, ఎడ్ల బండ్లపై ఉపగ్రహాలను తీసుకెళ్లిన రోజుల నుండి నేడు ప్రపంచ దేశాల ఉపగ్రహాలను అతి తక్కువ ఖర్చుతో కక్ష్యలోకి చేర్చే స్థాయికి మనం ఎదిగాం. 1975 ఏప్రిల్ 19న మన తొలి ఉపగ్రహం 'ఆర్యభట్ట'ను సోవియట్ యూనియన్ సహాయంతో ప్రయోగించిన భారత్, నేడు తన స్వంత వాహక నౌకలైన PSLV, GSLVలతో ప్రపంచ రికార్డులను సృష్టిస్తోంది.

భారత అంతరిక్ష రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన వ్యవస్థలలో 'ఇన్‌శాట్' (INSAT) శ్రేణి ప్రధానమైనది. 1983లో ప్రారంభమైన ఈ వ్యవస్థ ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోనే అతిపెద్ద సమాచార ఉపగ్రహ వ్యవస్థగా ఎదిగింది. ప్రస్తుతం వందలాది ట్రాన్స్‌పాండర్ల సహాయంతో టెలివిజన్ ప్రసారాలు, రేడియో నెట్‌వర్క్, వాతావరణ హెచ్చరికలు, విపత్తు నిర్వహణ వంటి సేవలను అందిస్తోంది. హస్సన్ (కర్ణాటక), భోపాల్ (మధ్యప్రదేశ్) కేంద్రాల నుండి ఈ ఉపగ్రహాలను నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. అంతరిక్ష ప్రయోగాలపై పెట్టే ఖర్చు వృధా అని భావించే వారికి ఇస్రో సాధించిన విజయాలే సమాధానం. ఉదాహరణకు, అమెరికా వంటి దేశాలు అంగారక యాత్ర (మీావీ) కోసం వేల కోట్లు ఖర్చు చేస్తే, భారత్ కేవలం 450 కోట్ల రూపాయలతో (సుమారు 74 మిలియన్ డాలర్లు), హాలీవుడ్ సినిమా నిర్మాణ వ్యయం కంటే తక్కువతో మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది.

ప్రస్తుతం భారత్ వద్ద మూడు ప్రధాన ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి. తుంబా (కేరళ)లో రాకెట్ విడిభాగాల తయారీ మరియు వాతావరణ రాకెట్ల ప్రయోగాలు జరుగుతుంటే, శ్రీహరికోట (ఆంధ్రప్రదేశ్) లోని 'సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం' (SHAR) ప్రధాన ప్రయోగ వేదికగా నిలుస్తోంది. ఇక్కడ ఉన్న రెండు లాంచ్ ప్యాడ్ల ద్వారా ఏడాదికి పలు ఉపగ్రహాలను ప్రయోగించే సామర్థ్యం మనకుంది. ఒరిస్సాలోని బలేశ్వర్ కేంద్రం ప్రధానంగా క్షిపణి పరీక్షలకు వేదికగా ఉంది. ఇస్రో చరిత్రలో మైలురాళ్లుగా నిలిచిన సంఘటనలు అనేకం. 2017లో పి.ఎస్.ఎల్.వి-సి37 ద్వారా ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించి భారత్ ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇందులో 96 ఉపగ్రహాలు అమెరికావే కావడం విశేషం. ఇది భారత వాహక నౌకల విశ్వసనీయతకు మరియు తక్కువ వ్యయానికి నిదర్శనం.

ఇటీవలి కాలంలో అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పెను మార్పులకు నాంది పలికింది. 'ఇన్-స్పేస్' (IN-SPACe) వంటి సంస్థల ద్వారా ప్రైవేటు స్టార్టప్‌లు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టాయి. దీనివల్ల ఆర్థిక లావాదేవీలు పెరగడమే కాకుండా, సాంకేతికతలో వినూత్న ఆవిష్కరణలు చోటు చేసుకుంటున్నాయి. గత దశాబ్ద కాలంలో భారత్ 34 దేశాలకు చెందిన సుమారు 393 ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించి భారీ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్ వంటి అగ్రదేశాలు సైతం నేడు ఇస్రో సేవలను వినియోగించుకుంటున్నాయంటే మన ప్రాముఖ్యత ఎంత పెరిగిందో అర్థం చేసుకోవచ్చు

2023వ సంవత్సరం భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. 'చంద్రయాన్-3' మిషన్ ద్వారా చంద్రుని దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన మొదటి దేశంగా భారత్ అవతరించింది. దీని వెనుక శాస్త్రవేత్తల దశాబ్దాల కఠోర శ్రమ దాగి ఉంది. కేవలం చంద్రుడికే పరిమితం కాకుండా, సూర్యుడిపై అధ్యయనం కోసం 'ఆదిత్య-ఎల్1'ను విజయవంతంగా ప్రయోగించాం. రానున్న రోజుల్లో 'గగన్ యాన్' ద్వారా భారతీయులను అంతరిక్షంలోకి పంపే బృహత్తర కార్యక్రమం సిద్ధమవుతోంది. ఇది విజయవంతమైతే, అమెరికా, రష్యా, చైనా తర్వాత సొంతంగా మానవ అంతరిక్ష యాత్ర చేపట్టిన నాలుగో దేశంగా భారత్ నిలుస్తుంది. ముగింపుగా చూస్తే, అంతరిక్షం అనేది కేవలం నక్షత్రాల అన్వేషణ మాత్రమే కాదు, అది దేశ భద్రత, ఆర్థికాభివృద్ధి మరియు సాంకేతిక సార్వభౌమాధికారానికి నిదర్శనం. విక్రమ్ సారాభాయ్ వేసిన పునాది, అబ్దుల్ కలాం అందించిన క్షిపణి పరిజ్ఞానం, సతీష్ ధావన్ నేతృత్వంలో జరిగిన అభివృద్ధి నేడు సోమనాథ్ వంటి నాయకత్వంలో శిఖరాగ్రానికి చేరుతోంది. అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో, భారత్ తనదైన ముద్రను విశ్వవ్యాప్తంగా వేస్తూ, 'వసుధైక కుటుంబకం' స్ఫూర్తితో అంతరిక్ష ఫలాలను సామాన్య మానవుడికి సైతం చేరువ చేస్తోంది. రాబోయే కాలంలో అంతరిక్ష పర్యాటకం, అంతరిక్ష స్టేషన్ నిర్మాణం వంటి రంగాల్లోనూ భారత్ అగ్రగామిగా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.



# ఇంజినీర్ల స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం

## నేడు విశ్వేశ్వరయ్య వర్ధంతి..

భారతదేశం నేడు సుభిక్షంగా, వరద ముప్పు లేని పంట పొలాలతో అలరారుతోందంటే దానికి కారణం ఒక మహామనిషి దూరదృష్టి. ఉగ్రరూపం దాల్చిన గంగమ్మను ఆపినా, సామాన్య భక్తుడు ఏడుకొండల వాడి చెంతకు చేరేందుకు ఘాట్ రోడ్డు మార్గం చూపినా అది ఆయనకే సాధ్యమైంది. ఆయనే ఆధునిక భారత నిర్మాణ శిల్పి, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఏప్రిల్ 12న ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను స్మరించుకోవాల్సిన బాధ్యత దేశంపై ఉంది.

### తెలుగు మూలాలు.. మైసూర్ దివాన్:

విశ్వేశ్వరయ్య పూర్వీకులు ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాలోని మోక్షగుండం గ్రామానికి చెందినవారు. మూడు శతాబ్దాల క్రితమే వారు మైసూరుకు వలస వెళ్లినా, వారి ఇంటి పేరుగా ఆ ఊరి నామధేయమే మిగిలిపోయింది. 1861 సెప్టెంబర్ 15న జన్మించిన ఆయన, అత్యంత ప్రతిభావంతుడైన ఇంజినీర్‌గా, రాజనీతిజ్ఞుడిగా ఎదిగారు. 1912 నుండి 1919 వరకు మైసూరు దివాన్‌గా పనిచేసి ఆ ప్రాంతాభివృద్ధికి బాటలు వేశారు.

### హైదరాబాద్‌కు రక్షణ కవచం:

1908లో మూసీ నది ఉప్పొంగి హైదరాబాద్ నగరం జలదిగ్బంధంలో చిక్కుకున్నప్పుడు, అప్పటి నిజాం నవాబు ఆహ్వానం మేరకు విశ్వేశ్వరయ్య ఇక్కడికి వచ్చారు. ఆయన రూపొందించిన పటిష్టమైన మురుగునీటి పారుదల పథకం, గండిపేట్ (ఉస్మాన్ సాగర్), హిమాయత్ సాగర్ జంట జలాశయాల నిర్మాణం నేటికీ హైదరాబాద్‌ను వరదల నుండి రక్షిస్తూ, నగరవాసుల దాహార్తిని తీరుస్తున్నాయి. కేవలం ఇక్కడ మాత్రమే కాకుండా, విశాఖపట్నం రేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను, తిరుమల ఘాట్ రోడ్డును, ఆసియాలోనే అతిపెద్దదైన కృష్ణరాజ సాగర్ డ్యామ్‌ను ఆయన పర్యవేక్షణలోనే నిర్మించారు.

### అత్యున్నత పురస్కారాలు:

దేశానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తుగా 1955లో భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారం 'భారతరత్న'తో సత్కరించింది. అంతకుముందే బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు 'నైట్ కమాండర్' బిరుదును ఇచ్చింది. ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 15ను దేశవ్యాప్తంగా 'ఇంజనీర్ల దినోత్సవం'గా జరుపుకోవడం ఆయన పట్ల మనకున్న గౌరవానికి నిదర్శనం.

### నేటి ఇంజినీర్లకు సందేశం:

విశ్వేశ్వరయ్య నూరేళ్ల నిండు జీవితాన్ని గడపడమే కాకుండా, తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారు. నేడు ఏటా లక్షల మంది ఇంజినీర్లు పట్టభద్రులవుతున్నారు. కానీ, నాణ్యత లోపించడం, అవినీతి ఆరోపణలు రావడం విచారకరం. ప్రతి ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని, జాతి గర్వించేలా అద్భుత కట్టడాలను నిర్మించాలని, ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆకాంక్షిద్దాం.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అంతర్జాతీయ స్థాయి కమ్యూనిస్టు ధ్రువతార.. మాకినేని

## సిద్ధాంత బలంతో సాగిన రాజీలేని పోరాటం : నేడు బసవపున్నయ్య వర్ధంతి..



భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో సిద్ధాంత పరంగా, ఆచరణాత్మకంగా చెరగని ముద్ర వేసిన అగ్రగణ్య నాయకుడు కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య. రేపల్లె మండలం తూర్పుపాలెంలోని ఒక భూస్వామ్య కుటుంబంలో పుట్టి, పీడిత ప్రజల విముక్తి కోసం తన ఆస్తిపాస్తులను సైతం త్యాగం చేసిన ధీశాలి ఆయన. ఏప్రిల్ 12న ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరిస్తూ ప్రత్యేక కథనం.

### స్టాలిన్, మావోలతో చర్చలు:

బసవపున్నయ్య కేవలం జాతీయ స్థాయి నేత మాత్రమే కాదు, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారు. ప్రపంచ ప్రఖ్యాత నాయకులైన జోసెఫ్ స్టాలిన్, మావో సేటుంగ్, చౌ ఎన్ లై వంటి వారితో ముఖాముఖి చర్చలు జరిపిన మేధావి ఆయన. మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాలపై ఆయనకున్న పట్టు చూసి అంతర్జాతీయ వేదికలపై సైతం అందరూ ఆశ్చర్యపోయేవారు.

### తెలంగాణ సాయుధ పోరాటంలో పాత్ర:

తెలంగాణ సాయుధ పోరాట కాలంలో పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావులతో కలిసి పున్నయ్య క్రియాశీలక పాత్ర పోషించారు. పోరాటానికి అవసరమైన నిధుల సమీకరణ, ఆయుధాల కొనుగోలు మరియు చేరవేత బాధ్యతలను ఆయనే స్వయంగా పర్యవేక్షించేవారు. సీపీఎం ఆవిర్భావంలో ఆయన కీలక పాత్రధారి. 1964 నుండి మరణించే వరకు సుమారు నాలుగు దశాబ్దాల పాటు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా కొనసాగారు.

### రాణించిన పార్లమెంటేరియన్:

సిద్ధాంతకర్తగానే కాకుండా గొప్ప పార్లమెంటేరియన్‌గా కూడా ఆయన గుర్తింపు పొందారు. 1952 నుండి 1966 వరకు వరుసగా 14 ఏళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగి, ప్రజా సమస్యలపై గళమెత్తారు. చైనా-భారత్ యుద్ధ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన్ను రెండుసార్లు జైలులో పెట్టినా, సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఆయన నిక్కచ్చిగా చెప్పారు.

### సడలని విశ్వాసం:

1990లలో సోవియట్ యూనియన్ కుప్పకూలిన తరుణంలో ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టు సిద్ధాంతంపై దాడులు జరిగినా, ఏమాత్రం చలించని ధీరుడు బసవపున్నయ్య. 'పీపుల్స్ డెమోక్రసీ' పత్రిక ఎడిటర్‌గా 14 ఏళ్లు పని చేస్తూ సిద్ధాంత వ్యాప్తికి నిరంతరం కృషి చేశారు. నిరంతరం చదవడం, విస్తృతంగా రాయడం ఆయన అలవాటు. పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం నిరంతరం తపించే ఆ మహానేత 1992 ఏప్రిల్ 12న ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పని చేస్తూనే తుదిశ్వాస విడిచారు.

- రామకిష్టయ్య సంగనభట్ల | 9440595494




# అక్షర యోధుడు.. అట్లూరి పిచ్చేశ్వర రావు

## అనువాద సాహిత్యంలో, వెండితెర రచనలో ఆయన ముద్ర అజరామరం

అట్లూరి పిచ్చేశ్వర రావు (ఏప్రిల్ 12, 1925 - సెప్టెంబర్ 26, 1966), తెలుగు కథకుడు, అనువాదకుడు, నవలా రచయిత, స్క్రీన్ ప్లే రచయిత కూడా. పిచ్చేశ్వర రావు ఆంధ్ర ప్రదేశ్ లోని కృష్ణా జిల్లా యందు చౌటపల్లి గ్రామంలో ఏప్రిల్ 12, 1925 న జన్మించారు. ఆయన కుటుంబం సమీప గ్రామమైన పులపర్రు గ్రామానికి వలస పోయింది. చౌటపల్లి గ్రామంలోనూ, కైకలూరు పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. హిందీ విశారద పరీక్షలలో ప్రథముడుగా నిలిచారు. తన ఇంటర్మీడియట్ విద్యను హిందూ కాలేజ్ లో పూర్తి చేశారు. విద్య పూర్తయిన తరువాత 1945 లో భారత నౌకా దళంలో చేరారు. 1948 లో బి.ఆర్.డబ్ల్యూ, కె.సి.జి. పరీక్షలలో ఉత్తీర్ణుడయ్యారు. 1953 లో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. పిచ్చేశ్వర రావు, ప్రముఖ కవి, సంఘ సంస్కర్త అయిన త్రిపురనేని రామస్వామి కనిష్ఠ పుత్రికైన చౌద రాణిని వివాహం చేసుకున్నారు. ఆమె కూడా కథా రచయిత్రి, నవలా రచయిత్రి. ఆమె తెలుగు పుస్తక శాలను మద్రాసులో ప్రారంభించిం ది. ఆమె 1996 లో మరణించింది. పిచ్చేశ్వర రావు తెలుగు దినపత్రిక అయిన విశాలాంధ్ర దినపత్రికలో కొంత కాలం పాటు పనిచేశారు. 1962 లో మద్రాసు (ప్రస్తుతం చెన్నై) కు వెళ్ళి చిత్ర పరిశ్రమలో స్క్రీన్ రైటర్ గా స్థిర పడ్డారు. హిందీ భాషలో గల సాహిత్యాన్ని తెలుగులో అనువాదం చేయుటకు కృషి చేశారు. అవి గోదాన్, ప్రతిధ్వని, పేకముక్కలు,, గాడిద ఆత్మ కథ. ఆ అనువాదంలో భాగంగా, అనేక కథలు, రేడియో నాటికలు, వంటివి రాసాడు. వాటిలో మనసులో మనిషీ ప్రాధాన్యత పొందింది. "గౌతమ బుద్ధ", "వీరేశ లింగం" అనే స్క్రిప్ట్స్ పిచ్చేశ్వర రావు రచనా ప్రతిభకు తార్కాణాలుగా నిలిచా యి. అవి తెలుగు భాషలో ప్రసిద్ధమైనవి. చిత్ర పరిశ్రమలో ప్రముఖ స్క్రీన్ రైటర్ గా ప్రసిద్ధి పొందారు. పిచ్చేశ్వర రావు సెప్టెంబర్ 26, 1966లో గుండె పోటుతో మరణించారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల, 9440595494

# కీళ్ల నొప్పులు, వాపులు ఇబ్బంది పెడుతున్నాయా..?

## అయితే ఈ ఆహారాలను తినండి, ఎంతో ఉపయోగం ఉంటుంది..!

వయస్సు మీద పడిన వారిలో సహజంగానే కీళ్లలో కదలికలు తగ్గి కీళ్ల నొప్పులు, వాపులు వస్తుంటాయి. ఈ సమస్య వచ్చేందుకు పలు ఇతర కారణాలు కూడా ఉంటాయి. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉండడం, పలు రకాల మందులను వాడడం, గాయాలు, దెబ్బలు తగలడం వంటివి కూడా కీళ్ల నొప్పులు, వాపులు వచ్చేందుకు కారణం అవుతాయి. శరీరంలో కొన్ని రకాల పోషకాలు లోపించడం వల్ల కూడా ఇలా జరుగుతుంది. చలికాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే కీళ్ల నొప్పులు, వాపులు ఉన్నవారు నొప్పిని తగ్గించే మందులను వాడుతుంటారు. ఇవి అప్పటి వరకు తాత్కాలికంగా ఉపశమనం అందించినా దీర్ఘకాలంలో తరచూ నొప్పి నివారణ మందులను ఉపయోగం అంత మంచిది కాదు. వీటి వల్ల కిడ్నీలపై భారం పడుతుంది. ఇంకా అనేక సమస్యలు వస్తాయి. కనుక కీళ్ల నొప్పులు, వాపులను సహజసిద్ధంగా తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. అందుకు గాను యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉండే ఆహారాలను రోజూ తీసుకోవాల్సి ఉంటుంది. వీటి వల్ల ఎంతగానో ఉపయోగం ఉంటుంది.



**ఆకుకూరలు, కూరగాయలు..**

కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించేందుకు గాను ఆకుకూరలు అద్భుతంగా పనిచేస్తాయి. వీటిల్లో అనేక రకాల మినరల్స్ ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. పాలకూర, తోటకూర, బచ్చలికూరను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. వీటిల్లో విటమిన్ కె అధికంగా ఉంటుంది. ఇది వాపులను తగ్గించడంలో సహాయం చేస్తుంది. ఆకుకూరల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గేలా చేస్తాయి. దీని వల్ల ఆర్థరైటిస్ లేదా కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. క్యాబేజీ, కీరదోస, కొత్తిమీర వంటి కూరగాయలు, ఆకుకూరలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇవి సమస్య నుంచి బయట పడేలా చేస్తాయి. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

**పసుపు, అల్లం..**

పసుపులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. కనుక దీన్ని రోజూ తీసుకుంటే నొప్పులు, వాపులకు చెక్ పెట్టవచ్చు. పసుపును మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. కానీ ఇది మన శరీరానికి సరిపోదు. కనుక పసుపును విడిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఒక కప్పు గోరు వెచ్చని నీటిలో లేదా పాలలో పావు టీస్పూన్ పసుపును కలిపి రోజూ రాత్రి పూట తాగాల్సి ఉంటుంది. దీని వల్ల ఎంతో ఫలితం ఉంటుంది. నొప్పులను, వాపులను తగ్గిస్తుం ది. అలాగే మనం తరచూ వంటల్లో వేసే అల్లం కూడా మేలు చేస్తుంది. దీని వల్ల అనేక అనారోగ్య సమస్యలను తగ్గించు కోవచ్చు. అల్లంలోనూ యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అల్లం రసంను రోజూ రెండు పూటలా పూటకు ఒక టీస్పూన్ చొప్పున భోజనానికి ముందు సేవిస్తుండాలి. దీని వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. నొప్పులు, వాపులు తగ్గి ఉపశమనం లభిస్తుంది.

**బీట్ రూట్, చేపలు..**

బీట్‌రూట్‌ను చాలా మంది అంతగా ఇష్టపడరు. కానీ ఇది అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. బీట్ రూట్‌లో పొటాషియం, మెగ్నిషియం, నైట్రేట్స్ ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. కనుక రోజూ బీట్ రూట్‌ను ఒక కప్పు మోతాదులో తింటుంటే ఫలితం ఉంటుంది. కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించుకోవచ్చు. బీట్ రూట్‌ను నేరుగా తినలేకపోతే జ్యూస్ చేసి ఒక కప్పు మోతాదులో రోజూ తాగాలి. దీని వల్ల సమస్య నుంచి సులభంగా బయట పడవచ్చు. అలాగే వారంలో కనీసం రెండు సార్లు చేపలను తింటున్నా ఉపయోగం ఉంటుంది. చేపలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ పోషకాలుగా పనిచేస్తాయి. అలాగే చేపల్లో విటమిన్లు బి6, బి12, విటమిన్ డి ఉంటాయి. ఇవి కూడా నొప్పులు, వాపులను తగ్గించడంలో సహాయం చేస్తాయి. కనుక తరచూ చేపలను తింటుంటే ఉపయోగం ఉంటుంది. ఇలా ఆయా ఆహారాలను తరచూ తింటుంటే కీళ్ల నొప్పులు, వాపులను సహజసిద్ధంగా తగ్గించుకోవచ్చు.

## మీకు యాక్టివేటెడ్ చార్ కోల్

# అంటే ఏమిటో తెలుసా?

### దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?

పూర్వం ప్రజలు బొగ్గులతో దంతాలను తోముకునే వారన్న సంగతి తెలిసిందే. అంతేకాకుండా బొగ్గును పాత్రలను శుభ్రం చేసేందుకు కూడా ఉపయోగించేవారు. అయితే ఇప్పుడు బొగ్గు దాదాపుగా లభించట్లేదు. అందరూ వంట గ్యాస్‌ను వాడుతున్నారు. కనుక బొగ్గు రావడం లేదు. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో మనకు యాక్టివేటెడ్ చార్ కోల్ అని లభిస్తుంది. దీన్ని కొందరు వినే ఉంటారు. దీన్ని ఎక్కువగా మెడిసిన్లను, సౌందర్య సాధన ఉత్పత్తులను తయారు చేసేందుకు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని కంపెనీలు తమ టూత్ పేస్టులలోనూ చార్ కోల్‌ను అందిస్తున్నాయి. అయితే వాస్తవానికి చార్ కోల్ మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది మనకు మార్కెట్‌లో పొడి, ట్యాబ్లెట్ల రూపంలో లభిస్తుంది. దీన్ని బాహ్యంగా ఉపయోగించవచ్చు. లేదా అంతర్గతంగా కూడా తీసుకోవచ్చు. యాక్టివేటెడ్ చార్ కోల్‌తో మనకు అనేక లాభాలు కలుగుతాయి. దీంతో పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు.

**జీర్ణ సమస్యలకు..**

యాక్టివేటెడ్ చార్ కోల్ అంటే కర్రలను కాల్చడం వల్ల ఏర్పడే బొగ్గు. కానీ దీన్ని మనకు నేరుగా విక్రయించరు. చార్ కోల్‌ను తయారు చేసిన తరువాత శుభ్రం చేసి మనకు ప్యాక్‌లలో అందిస్తారు. యాక్టివేటెడ్ చార్ కోల్‌ను చార్ కోల్ అని సింపుల్‌గా కూడా పిలుస్తారు. కొందరు దీన్ని కొబ్బరి టెంకలు లేదా పొట్టును కాల్చి దాంతో వచ్చే బొగ్గు ద్వారా తయారు చేస్తారు. అయితే ఏ పదార్థం ఉపయోగించినా కూడా చార్ కోల్ ఒకటే విధంగా ఏర్పడుతుంది. ఇక చార్ కోల్‌తో దంతాలను తోముకోవడం వల్ల నోట్లో ఉండే బ్యాక్టీరియ నశించి నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. చార్ కోల్‌కు చెందిన ట్యాబ్లెట్లు మనకు ఆన్ లైన్‌లో, మెడికల్ షాపుల్లో లభిస్తాయి. వీటిని పోషకాహార నిపుణులు లేదా వైద్యుల సూచన మేరకు తీసుకోవచ్చు. సాధారణంగా వీటిని రోజుకు 500 మిల్లీగ్రాముల మోతాదులో తీసుకుంటారు. ఈ ట్యాబ్లెట్లను వాడడం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మలబద్దకం తగ్గుతుంది.

**వ్యర్థాలను బయటకు పంపేందుకు..**

ఫుడ్ పాయిజనింగ్ అయిన వారు యాక్టివేటెడ్ చార్ కోల్‌ను వాడితే ఎంతో ఫలితం ఉంటుంది. సాధారణంగా కొన్ని సార్లు మనకు మనం తాగే ద్రవాలు, తినే ఆహారం కారణంగా ఫుడ్ పాయిజనింగ్ అవుతుంది. అలాంటప్పుడు యాక్టివేటెడ్ చార్ కోల్ ను తీసుకుంటే ఫలితం ఉంటుంది. దీని వల్ల పొట్టలో ఉండే అసౌకర్యం కూడా తొలగిపోతుంది. యాక్టివేటెడ్ చార్ కోల్‌ను తీసుకుంటుంటే శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు వెళ్లిపోతాయి. దీంతో శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. బాడీ డిటాక్స్ అవుతుంది. మద్యం విపరీతంగా సేవించడం వల్ల వచ్చే హ్యాంగోవర్ సమస్యను చార్ కోల్ తగ్గిస్తుంది. హ్యాంగోవర్ ఉన్నవారు యాక్టివేటెడ్ చార్ కోల్‌ను తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

**చర్మ సమస్యలకు..**

పురుగులు, కీటకాలు కుట్టిన చోట కొబ్బరినూనెలో యాక్టివేటెడ్ చార్ కోల్‌ను కలిపి రాయాలి. దీంతో మంట, దురద, నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే అన్ని రకాల చర్మ సమస్యలకు కూడా చార్ కోల్‌ను ఉపయోగించవచ్చు. దీన్ని పలు రకాల ఫేస్ ప్యాక్‌లలోనూ వాడవచ్చు. దీన్ని వాడడం వల్ల చర్మంపై ఉండే మృత కణాలు తొలగిపోతాయి. చర్మం తేమగా, మృదువుగా మారుతుంది. కాంతివంతంగా కనిపిస్తుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. యాక్టివేటెడ్ చార్ కోల్‌ను వాడడం వల్ల ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు సైతం తగ్గిపోతాయి. ఇలా యాక్టివేటెడ్ చార్ కోల్ మనకు ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది.



## ఆకుపచ్చ రంగులో ఉండే ఈ ఆహారాలను రోజూ తినండి..

# ఎన్నో లాభాలు కలుగుతాయి..!



ఆకుకూరలు, కూరగాయలతోపాటు పలు ఇతర ఆహారాలు కూడా ఆకుపచ్చ రంగులో ఉంటాయన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆకుపచ్చ రంగులో ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. ఆకుపచ్చ రంగులో ఉండే ఆహారాలను పోషకాలకు గనిగా చెబుతుంటారు. ఈ ఆహారాల్లో అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా అనేక రకాల విటమిన్లు, మినరల్స్, ఫైబర్, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ ఆహారాల్లో క్లోరోఫిల్ అనే వర్ణ ద్రవ్యం కూడా ఎక్కువగానే ఉంటుంది. అందుకనే అవి ఆకుపచ్చ రంగులో ఉంటాయి. అయితే ఆకుపచ్చ రంగులో ఉండే ఆహారాలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇవి మన శరీరానికి పోషణను, శక్తిని అందిస్తాయి. జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేలా చూస్తాయి. మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి.

**ఎముకల దృఢత్వానికి..**

ఆకుపచ్చ రంగులో ఉండే ఆహారాల్లో పాలకూర ఒకటి. ఇందులో ఫోలేట్, విటమిన్ కె, విటమిన్ ఎ, ఐరన్, లుటీన్ అధికంగా ఉంటాయి. పాలకూరను తింటే ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. విరిగిన ఎముకలు త్వరగా అతుక్కుంటాయి. పాలకూరలో ఉండే విటమిన్ కె, క్యాల్షియం ఎముకలకు మేలు చేస్తాయి. ఇందులో ఉండే లుటీన్, జియాజాంతిన్ అనే పోషకాలు కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కళ్లలో శుక్లాలు ఏర్పడకుండా చూస్తాయి. కంటి చూపును మెరుగు పరుస్తాయి. అలాగే ఆకుపచ్చని ఆహారాల్లో బ్రోకలీ కూడా ఒకటి. ఇది చూసేందుకు అచ్చం కాలిఫ్లవర్ లా ఉంటుంది. కానీ అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో విటమిన్లు సి, కెలతోపాటు ఫైబర్, సల్ఫోరాఫేన్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపిస్తాయి. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు.

**కొలెస్ట్రాల్ స్థాయిలకు..**

అవకాడోలు కూడా ఆకుపచ్చ రంగులో ఉంటాయి. వీటిల్లో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. అలాగే వీటిల్లో పొటాషియం, విటమిన్ కె, ఫోలేట్ అధికంగా ఉంటాయి. అవకాడోలను తినడం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. బీపీ నియంత్రణలో ఉంటుంది. అలాగే ఆకుపచ్చ రంగులో ఉండే గ్రీన్ టీని కూడా రోజూ తీసుకోవాలి. ఇందులో పాలిఫినాల్స్, ఎల్-థియానైన్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అందువల్ల గ్రీన్ టీని సేవిస్తుంటే మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే ఒత్తిడి, ఆందోళన నుంచి బయట పడవచ్చు. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

**పెద్ద పేగు ఆరోగ్యానికి..**

ఇక ఆకుపచ్చ రంగులో ఉండే బీన్స్, అదే రంగులో ఉండే అలసందలను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. వీటిల్లో ఫైబర్‌తోపాటు విటమిన్లు కె, సి, మాంగనీస్ అధికంగా ఉంటాయి. కనుక వీటిని తింటే పెద్ద పేగు ఆరోగ్యంగా ఉంటుంది. వీటిల్లో ఉండే సిలికాన్ వల్ల ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కివి పండ్లను కూడా తినవచ్చు. ఇవి కూడా ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఈ పండ్లలో విటమిన్లు సి, కె, ఫైబర్, సెరొటోనిన్ అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఏర్పడదు. నిద్ర లేమి తగ్గుతుంది. పడుకున్న వెంటనే గాఢంగా నిద్రిస్తారు. ఇలా ఆకు పచ్చ రంగులో ఉండే ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**నెరడిగొండ:** పిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తేనే వారి ఆరోగ్యం మెరుగుపడుతుందని లఖంపూర్ గ్రామ సర్పంచ్ సెడ్మకి సుజాత గంగాధర్ అన్నారు. శనివారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ మాడవి గోదావరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలంలో మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు నూతన బస్టాండ్‌లో కల్లూరు శాంతినగర్ పెద్దల ఆధ్వర్యంలో ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ పెద్దలు, మాజీ ఎంపీటీసీ ఖమ్మంపాటి పుల్లారావు, మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ వెంగళ వెంకటేశ్వర్లు, వరదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతినగర్ పెద్దల సేవా కార్యక్రమాన్ని ప్రయాణికులు, టీం సత్తుపల్లి ప్రతినిధులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

## సత్తుపల్లి–తిరుపతి సూపర్ లగ్జరీ బస్సు చార్జీల తగ్గింపు



**సత్తుపల్లి:** సత్తుపల్లి నుంచి తిరుపతి వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు చార్జీలను తగ్గించినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సెక్టార్‌లో తిరిగే సూపర్ లగ్జరీ బస్సులకు 16 శాతం నుంచి 40 శాతం వరకు రాయితీ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు–తిరుపతి మధ్య 18 శాతం (రూ.110), చిలకలూరిపేట–తిరుపతి మధ్య 19 శాతం (రూ.100), ఒంగోలు–తిరుపతి మధ్య 22 శాతం (రూ.30), నెల్లూరు–తిరుపతి మధ్య 24 శాతం (రూ.20), నాయుడుపేట–తిరుపతి మధ్య 33 శాతం (రూ.30), శ్రీకాళహస్తి–తిరుపతి మధ్య 40 శాతం (రూ.20) రాయితీ ప్రకటించినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సత్తుపల్లి డిపో పరిధిలోని తిరుపతి భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కోస్నిగ్రామంలో జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ



**కాగజ్‌నగర్:** మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శనివారం కాగజ్‌నగర్ మండలం కోస్ని గ్రామంలో ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపిన సమానత్వం, సామాజిక న్యాయం మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ, కోస్ని గ్రామ సర్పంచ్ వాసాకే పుల్లబాయ్, కాగజ్‌నగర్ మండల అధ్యక్షులు పార్వతి అంజన్న, బట్టుపల్లి సర్పంచ్ రాజేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యత

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్:** మాదకద్రవ్యాల నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి రిమ్స్ ఆడిటోరియం వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం రిమ్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. సమాజంలో డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ముఖ్యంగా 'అల్ప్రాజోలం' వంటి హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ విషయంలో కెమిస్ట్లు, ఫార్మసిస్ట్‌లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇలాంటి మందులను విక్రయించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నపాటి జలుబు, దగ్గుకు యాంటీబయోటిక్స్ స్వయంగా వాడకూడదని, షెడ్యూల్ హెచ్, హెచ్1 మందులను వైద్యుల సలహాతోనే వినియోగించాలని తెలిపారు. అధిక మోతాదులో మందుల వినియోగంతో కిడ్నీలు, లివర్ వంటి అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, దీనిపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రిమ్స్, మెడికల్ కళాశాల ప్రాంగణాల్లో సింథటిక్ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగంపై నిఘా పెంచాలని హెచ్ఓడీలను ఆదేశించారు. మత్తుకు బానిసైన విద్యార్థులకు కౌన్సెలింగ్ అందించేందుకు డీ–అడిక్షన్ సెంటర్లను వినియోగించాలని సూచించారు. మందుల దుకాణాల్లో క్యూఆర్ కోడ్ విధానం ద్వారా మందుల దుష్ప్రభావాలపై వినియోగదారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఔషధ నియంత్రణపై వైద్యులు, ఔషధ దుకాణాల యజమానులతో ప్రతిజ్ఞ చేయించి, సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్రీలత, ఎస్సై సందీప్, మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు




**కాగజ్నగర్:** కాగజ్నగర్ మండలం సీఆర్ నగర్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లేండుగురే శ్యాంరావు, ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్యాంరావు మాట్లాడుతూ భారత దేశంలో సామాజిక సంస్కరణల ఉద్యమానికి మార్గదర్శకుడైన జ్యోతిరావు పూలే కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. శూద్రులు, దళితులు, మహిళల హక్కుల కోసం ఆయన చేసిన కృషి అపూర్వమని కొనియాడారు. తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి దేశంలో తొలి బాలికల పాఠశాలను స్థాపించి మహిళా విద్యకు నూతన దారులు చూపిన మహోన్నత వ్యక్తి అని గుర్తుచేశారు. మాలి కులస్తులకు ఎస్టీ హోదా సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని, ఈ దిశగా త్వరలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సమానత్వం, స్త్రీ విద్య, అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సంస్కర్త అని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాలి కులస్తులకు ఎస్టీ హోదా సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సీఆర్ నగర్ చౌరస్తాలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సంఘ స్థలంలో రూ.50 లక్షల వ్యయంతో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘ నాయకులు మోర్లే విజయ్ కుమార్, కొట్రంగే నాందేవ్, కొట్రంగే పోశెట్టి, టాకరే తిరుపతి, కొట్రంగే కిషన్, వాసకే హన్మంతు, నాను, సెండే వెంకటేష్

# గోక గణేష్ రెడ్డి కృషితో ఆదివాసి రైతులకు భూమి పట్టాలు



**తలమడుగు:** తలమడుగు మండల మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి కృషితో 13 సంవత్సరాలుగా భూమి పట్టాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆదివాసి రైతుల సమస్యకు పరిష్కారం లభించింది. జిల్లా కలెక్టర్ రాజర్షిషా చొరవతో 9 మంది ఆదివాసి రైతులకు 30 ఎకరాల భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్స్‌ను శనివారం అందజేశారు. తలమడుగు మండలం పల్సి(బి)తాండ గ్రామానికి చెందిన ఆదివాసి రైతులు గత 13 సంవత్సరాలుగా ఫారెస్ట్, రెవెన్యూ సమస్యల కారణంగా భూములపై హక్కులు పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గోక గణేష్ రెడ్డి గుర్తించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన పత్రాలు సమర్పించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రాజర్షిషా ప్రత్యేక శ్రద్ధ చూపించి హైదరాబాద్ సీసీఎల్ అధికారులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించారు. ఫలితంగా 9 మంది రైతులకు 30 ఎకరాల భూమికి పట్టాలు మంజూరు చేసి పాస్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు, రైతులు కలెక్టర్‌ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**వేంసూర్:** మండలంలోని రామన్నపాలెం గ్రామంలో జరిగిన వివాహ వేడుకతో పాటు గణేష్‌పాడు గ్రామంలో జరిగిన కుటుంబ పరామర్శ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు. రామన్నపాలెంలో వెలగపూడి సత్యనారాయణ–లక్ష్మి దంపతుల మనవరాలు, సర్వేశ్వరరావు– స్వప్న దంపతుల కుమార్తె దీపిక వివాహ వేడుకకు హాజరైన ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పెనుబల్లి మండల పరిధిలోని గణేష్‌పాడు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జుంజునూరి భాస్కరరావు కుటుంబాన్ని పరామర్శించారు. భాస్కరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఓదార్చారు. కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. భాస్కరరావు మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కస్టమర్లకు నరకం చూపిస్తున్న జేఎస్ఆర్ గ్యాస్ నిర్వాహకులు

- వినియోగదారుల ఆవేదన




**, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు పట్టణ కేంద్రంలోని జేఎస్ఆర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, సిబ్బంది కస్టమర్లకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మధిర రోడ్డులో ఉన్న మరో గ్యాస్ ఏజెన్సీ (లక్ష్మీ ఏజెన్సీ) తెల్లవారు జామున 4 గంటలకే సేవలు ప్రారంభించి వినియోగదారులకు సిలిండర్లు అందిస్తుండగా, జేఎస్ఆర్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది మాత్రం ఉదయం 10 గంటల తర్వాతే కార్యాలయానికి వస్తున్నారని చెబుతున్నారు. ఓటీపీ రాలేదని, కేవైసీ పూర్తికాలేదని, వేలిముద్రలు అవసరమని చెప్పి గంటల తరబడి క్యూలో నిలబెట్టిన తర్వాత తిరిగి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి తీవ్ర ఉష్ణోగ్రతలు ఉన్నా కనీసం నీడ కోసం టెంట్ కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. తాము తెల్లవారు జామున వచ్చి వేచిఉంటే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ దురుసుగా మాట్లాడుతున్నారని అంటున్నారు. అదేవిధంగా ముచ్చవరం రోడ్డులోని మరో గ్యాస్ ఏజెన్సీ నుంచి రాత్రి వేళల్లో కొంతమంది హోటల్ యజమానులు ఆటోల్లో సిలిండర్లు తీసుకెళ్తున్నట్లు కూడా విశ్వసనీయ సమాచారం ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సివిల్ సప్లయ్ అధికారులు, కల్లూరు మండల రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మైనార్టీ గురుకుల అడ్మిషన్ మేళా విజయవంతం



**జైనూర్:** జైనూర్ మైనార్టీ బాలికల గురుకులంలో ప్రవేశాల ప్రక్రియలో భాగంగా మండల కేంద్రంలోని జామా మస్జీద్ వద్ద ప్రత్యేక అడ్మిషన్ మేళా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ విషయాన్ని గురుకుల ప్రిన్సిపాల్ సూఫీయా నాజ్ శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూఫీయా నాజ్ మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థులు గురుకుల విద్యను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. గురుకులంలో విద్యార్థులకు పూర్తిగా ఉచిత విద్యతో పాటు వసతి, పోషకాహారం, యూనిఫామ్లు, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అదనంగా డిజిటల్ క్లాసులు, ఆధునిక సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా సదుపాయాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ కూడా అందిస్తున్నట్లు వివరించారు. అడ్మిషన్‌కు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియపై విద్యార్థులు, తల్లిదండ్రులకు సమగ్ర అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ మేళాకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. గురుకుల విద్యపై ఆసక్తి వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ గురుకులంలో అందుతున్న ఉచిత, నాణ్యమైన విద్య, వసతి సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. తమ పిల్లల భవిష్యత్తుకు ఇది మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు కూడా గురుకులంలో చేరేందుకు ఆసక్తి చూపించారు.

# ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై కార్యకర్తలతో కలిసి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పూలే సామాజిక ఉద్యమాలకు మార్గదర్శిగా నిలిచిన మహనీయుడని, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. మహిళా విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి తరతరాలకు ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గిమ్మ దీపక్ రావు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు గౌలి సంజయ్, అక్తర్ అలీ, ఉయిక అనసూయ, తులసిరాం, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ బెజ్జంకి అనిల్ కుమార్, అల్లూరి భూమా రెడ్డి, మామిడి మల్లారెడ్డి, కౌడాల సంతోష్, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఆఫ్సర్ ఖాన్, నాయిడి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# దీపక్ రావుకు ఘన సన్మానం



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గిమ్మ దీపక్ రావుకు పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి నాయిని సుదర్శన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దీపక్ రావు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం చేయాలని, సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే దిశగా నాయకులు, కార్యకర్తలు కష్టపడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు సమానంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. 2047 విజన్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిర పాలన దిశగా ముందుకు వెళ్తోందని తెలిపారు. ప్రజలను ప్రతిపక్షాల మాయమాటల్లో పడకుండా జాగ్రత్తగా ఉండాలని, గ్రామాలు, పట్టణాలను కలిసి కట్టుగా అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భూమారెడ్డి, ఇమ్రాన్, మాజీ కౌన్సిలర్ సంజీవ్, మాజీ ఉప సర్పంచ్ రాజేశ్వర్, మాజీ కౌన్సిలర్ శంకర్, కన్య ప్రభాకర్, నాయిడి ప్రకాష్, మేకల జితేందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళన మండల సమావేశం





## గందె రాజన్న ఏకగ్రీవంగా ఎన్నిక

**తిర్యాణి:** మండల కేంద్రంలోని శ్రీ కన్యక పరమేశ్వరి దేవాలయంలో శనివారం హిందూ సమ్మేళన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రతినిధులు హాజరై సంఘ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో మండల కమిటీని ఏర్పాటు చేసి గందె రాజన్నను మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులు, కార్యదర్శి, ప్రచార కార్యదర్శి తదితర పదవులకు సభ్యులను ఎంపిక చేశారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు గందె రాజన్న మాట్లాడుతూ కుల, మత భేదాలకు అతీతంగా హిందూ సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామ స్థాయిలో సంఘ కార్యక్రమాలను విస్తరించి యువతలో చైతన్యం కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 26న కొమురంభీం చౌరస్తాలోని రామాలయం ఆవరణలో జరగనున్న హిందూ మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సారా శంకర్ గౌడ్, రంగు అరుణ్ కుమార్, పులి వెంకటేష్, ఆత్రం గోపాల్, సుంగు, తొంగల తిరుపతి, కనక హనుమంత్ రావు, ఆశం అశోక్, శివ, కుమారం రాజు, అశోక్, ఆత్రం సుజాత, పెందోర్ దౌలత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యం

**ములుగు:** ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. "ఐ లవ్ ములుగు" థీమ్ వద్ద పోషణ్ పక్వాడ్ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ములుగు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం, పాత బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆమె ప్రారంభించారు. కాగా పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. పోషణ్ పక్వాడ్ ద్వారా పోషకాహారంపై ప్రజల్లో అవగాహన పెంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్, డిడబ్ల్యుఓ ప్రేమలత, సిడిపిఓ శిరీష, స్థానిక కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# పూలే ఆశయ సాధనకు కృషి



**గుడిహత్నూర్:** మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాల సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని గ్రామ సర్పంచ్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. మండలంలోని డోంగర్ గావ్ గ్రామంలో శనివారం మహాత్మ జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బాల బాలిక తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లేలా కుటుంబాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. అంటరానితనం నిర్మూలనపై గ్రామ సభల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ, అందరూ కలిసికట్టుగా జీవించే సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని పేర్కొన్నారు. పూలే సేవలు దేశానికి చిరస్మరణీయమని, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమ సమాజ స్థాపనకు జ్యోతిబాపూలే కృషి



**భీంపూర్:** భీంపూర్ మండలం గోన గ్రామంలో గ్రామ సర్పంచ్ మడావి కమలాబాయి ఆదేశాల మేరకు యువకులు మహాత్మ జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ముశ్రాన్ అహ్మద్ మాట్లాడుతూ జ్యోతిబా పూలే కుల, మత, వర్గ, లింగ భేదం లేకుండా సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి మహిళా విద్యాభివృద్ధికి పునాది వేసినట్లు తెలిపారు. పూలే చూపిన మార్గంలో నడవడమే ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవమని అన్నారు. ఈ సందర్భంగా పూలే సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మట్టి అక్రమ రవాణాలో కాంగ్రెస్‌కు ఎలాంటి ప్రమేయం లేదు



**తాండూర్:** మండలంలోని పలు చెరువుల్లో జరుగుతున్న మట్టి అక్రమ రవాణాలో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి ప్రమేయం లేదని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గట్టు మురళీధర్ రావు, తాండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి ఈసా స్పష్టం చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వివిధ దిన పత్రికల్లో వచ్చిన వార్తల్లో అధికార పార్టీ నాయకుల అండదండలతో మట్టి అక్రమ రవాణా జరుగుతోందని వచ్చిన ఆరోపణల్లో కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. పార్టీకి చెందిన ఏ నాయకుడు ఈ అక్రమ కార్యకలాపాల్లో పాల్గొంటే అది వ్యక్తిగత చర్యగానే పరిగణించాల్సి ఉంటుందని తెలిపారు. ఇలాంటి అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అన్నారు. చెరువుల వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత శాఖల ద్వారా కఠిన చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేస్తామని, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పుట్ట శ్రీనివాస్, జిలుకర శంకర్, దుర్గం మహేందర్, ఐఎన్‌టీయూసీ నాయకులు మసాడి నారాయణ, భాస్కరచారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



**తాండూర్:** మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలను శనివారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐఎన్టీయూసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జ్యోతిబాపూలే సామాజిక ఉద్యమాలకు మార్గదర్శిగా నిలిచిన మహనీయుడని అన్నారు. అణగారిన వర్గాల సామాజిక న్యాయానికి జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి అని కొనియాడారు. మహిళా విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, తాండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి ఈసా, కాంగ్రెస్ నాయకులు మామిడాల రాజేష్, పుట్ట శ్రీనివాస్, మద్దికుంట రామచందర్, జిలుకర శంకర్, దుర్గం మహేందర్, గౌస్, చాంద్ పాషా, ఐఎన్టీయూసీ నాయకులు మసాడి నారాయణ, భాస్కర చారి తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల భగవంతుడు జ్యోతిబా పూలే



**బెజ్జూర్:** బహుజనుల భగవంతుడు జ్యోతిబా పూలే అని మాలి సంఘం మండల అధ్యక్షులు ఆదే అశోక్ అన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శనివారం బెజ్జూర్ మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబాపూలే సామాజిక విప్లవ పితామహుడిగా, స్త్రీ విద్య కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడిగా గుర్తింపు పొందారని అన్నారు. 19వ శతాబ్దంలో అంటరానితనం, కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడి 1848లో తొలి బాలికల పాఠశాలను ప్రారంభించిన ఘనత ఆయనదేనని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం జిల్లా నాయకులు కొట్రంగి రామకృష్ణ, మండల నాయకులు సురేష్, శంకర్, నందయ్య, మోహన్ రావు, కృష్ణ, చిరంజీవి, తెలంగాణ జావిద్, పుల్లూరి సతీష్, దుర్గం తిరుపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**ఆదిలాబాద్:** సమాజంలో సమానత్వం, కుల వివక్ష నిర్మూలన కోసం మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన పోరాటం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ (డీసీసీ) కార్యాలయంలో శనివారం పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాలు, మహిళల హక్కుల కోసం పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బెజ్జంకి అనిల్, గోలి సంజయ్, మంగేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



**ఆదిలాబాద్:** అఖిల భారతీయ మాలి మహా సంఘం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పూలే చౌక్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలి మహా సంఘ నేతలు సంఘ ఉద్యమ పతాకాన్ని ఎగరేసి, మహాత్మ పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.సాంబన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ గురునూలే, రాష్ట్ర కోశాధికారి సతీష్ గురునూలే, జిల్లా అధ్యక్షులు డి.విజయ్ కుమార్, పటేళ్ల సంఘం అధ్యక్షులు రాగి గంగారాం, మాలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు అంబేకర్ చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు భాస్కర్, రాగి రామ్ కిషన్, సావిత్రిబాయి పూలే మహిళా మండలి సభ్యులు కల్పన పెట్కులే, రాగి గంగుతాయి, శాలిని ప్రధాన్, రాగి రోహిత తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం



**తాండూర్:** ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌టీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహమ్మద్ హబీబ్ పాషా ఆరోపించారు. శనివారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో తాండూర్ మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో మాట్లాడారు. ఆటో కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం అమలు చేసిన రూ.5లక్షల ప్రమాద బీమా పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు సదుపాయం కారణంగా ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ ప్రభావంతో ఇప్పటివరకు సుమారు 120 మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు పథకంతో రోడ్డు ప్రమాదాలు పెరిగాయని, ప్రభుత్వం మాత్రం వాటిని విజయంగా చూపిస్తుందని విమర్శించారు. సింగరేణి కార్మికులకు ప్రమాద బీమా ప్రకటించిన ప్రభుత్వం, ఆర్టీసీ కార్మికులకు ఒక కోటి రూపాయల బీమా ప్రకటించడం శోచనీయమని అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, సంక్షేమ బోర్డు ఏర్పాటు, సంవత్సరానికి రూ.12వేల ఆర్థిక సహాయం, ప్రతి మండల కేంద్రంలో ఆటో భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ చలానా ఫైన్లు తగ్గించాలని, ఫైనాన్సర్ల ఆగడాలను అరికట్టేందుకు కొత్త చట్టాలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలి

- ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున



**వరంగల్:** రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ అండర్ రైల్వే బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో ఏఐఎఫ్‌డిఎస్ వరంగల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు గూడా సాయిరాం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాహక్కు చట్టాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తూ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. విద్యా సంవత్సరం ముగియకముందే ముందస్తు అడ్మిషన్ల పేరుతో ఫీజుల మోత మోగిస్తున్నారని విమ ర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చేశాయని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నాయని మండిపడ్డారు. ఫీజు నియంత్రణకు సంబంధించిన ఉత్తర్వులు ఉన్నప్పటికీ అవి అమలులో లేవని అన్నారు. విద్యాహక్కు చట్టం సెక్షన్–6 ప్రకారం అడ్మిషన్లు జరగాల్సి ఉండగా, నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలాగే ద్వంద వైఖరిని అనుసరిస్తోందని విమర్శించారు. సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్, సహాయ కార్యదర్శి మార్త నాగరాజ్, రాకేష్, విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులు మహేష్, కళ్యాణ్, జిల్లా కమిటీ సభ్యులు అరవింద్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయాన్ని విస్మరించిన పాలకులు

**వర్గ పోరాటాలే ప్రత్యామ్నాయం**

**వరంగల్:** సామాజిక న్యాయాన్ని విస్మరించి ఆర్థిక, సామాజిక అంతరాలను పెంచే విధానాలతో పాలకులు పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని ఎంసిపిఐ(యు) పొలిట్ బ్యూరో సభ్యులు వల్లేపు ఉపేందర్ రెడ్డి విమర్శించారు. వర్గ, సామాజిక పోరాటాలే దోపిడికి ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. ఎంసిపిఐ(యు) హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి సందర్భంగా ములుగు రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి దళితులు, మహిళలకు విద్య హక్కుగా ఉండాలని విశ్వసించిన మహనీయుడని అన్నారు. తన భార్యను తొలి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది బాలికల విద్యకు పునాది వేసిన సంఘ సంస్కర్తగా కొనియాడారు. జమీందారులకు వ్యతిరేకంగా రైతులను సంఘటితం చేసి హక్కుల కోసం పోరాడిన విప్లవకారుడని తెలిపారు. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా సమానత్వ సమాజం కోసం ఆయన చేసిన కృషి నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మనువాద భావజాలాన్ని ప్రోత్సహిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను విస్మరించి పాలన కొనసాగుతోందని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో అంతరాలు లేని సమాజ నిర్మాణం కోసం వర్గ, సామాజిక పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్.రెడ్డి హంస రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కర్ర రాజిరెడ్డి, నీల రవీందర్, మాస్ సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు చీపురు ఓదయ్య, మంద భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# చదువుతోనే సమాజంలో మార్పు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్:** చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంటరానితనం, స్త్రీ, పురుష అసమానతల నిర్మూలనకు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే పేద వర్గాల విద్యాభివృద్ధికి పూలే మార్గం చూపారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ పూలే ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జిల్లాలో త్వరలోనే బీసీ ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పూలే జీవిత చరిత్ర ఆడియో సీడీని ఆవిష్కరించి, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, సంక్షేమ అధికారులు సోనియా, సునీత కుమారి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# శాంసన్ సెంచరీ.. చెన్నై సూపర్ విక్టరీ

## ఢిల్లీ క్యాపిటల్స్ పై 23 పరుగుల తేడాతో ఘన విజయం

## బౌలింగ్ లో అదరగొట్టిన జెమీ ఓవర్టన్, అన్షుల్ కాంబోజ్

**చెన్నై, ఏప్రిల్ 11:** ఐపీఎల్ లో భాగంగా చెన్నైలోని చిదంబరం స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ పై చెన్నై సూపర్ కింగ్స్ 23 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. సంజు శాంసన్ అద్భుత సెంచరీతో చెలరేగగా.. బౌలర్లు సమిష్టిగా రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత ఇరవై ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ నిర్ణీత ఓవర్లలో 189 పరుగులకే పరిమితమై పరాజయాన్ని మూటగట్టుకుంది.

### ఆకాశమే హద్దుగా శాంసన్

టాస్ గెలిచిన ఢిల్లీ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన చెన్నై బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించారు. ముఖ్యంగా సంజు శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 56 బంతుల్లోనే 115 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు భారీ స్కోరును అందించాడు. అతడికి తోడుగా ఆయుష్ మ్హాత్రే 36 బంతుల్లో 59 పరుగులు చేసి అద్భుత సహకారం అందించాడు. చివర్లో శివమ్ దూబే పది బంతుల్లో 20 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు చెన్నై బ్యాటర్ల దాటికి తేలిపోయారు.

### తడబడిన ఢిల్లీ బ్యాటర్లు

213 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ ఏ దశలోనూ విజయ తీరాల వైపు పయనించలేదు. ట్రిస్టన్ స్టబ్స్ 38 బంతుల్లో 60 పరుగులు, పాతుమ్ నిస్సాంక 24 బంతుల్లో 41 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేసినా లాభం దక్కలేదు. చివర్లో అశుతోష్ శర్మ పది బంతుల్లో 19 పరుగులతో మెరిశాడు. చెన్నై బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ కు ఢిల్లీ బ్యాటర్లు చేతులెత్తేశారు. చెన్నై బౌలర్లలో జెమీ ఓవర్టన్ కేవలం 18 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టి ఢిల్లీ పతనాన్ని శాసించాడు. అన్షుల్ కాంబోజ్ మూడు వికెట్లు తీయగా.. నూర్ అహ్మద్ ఒక వికెట్ దక్కించుకున్నాడు.








# బౌలర్ల ఘోర వైఫల్యం.. సన్‌రైజర్స్ పరాజయం

## 219 పరుగులు చేసినా కాపాడుకోలేని దైన్యం

## పంజాబ్ చేతిలో ఆరు వికెట్ల తేడాతో చిత్తు

**చండీగఢ్, ఏప్రిల్ 11:** పీసీఏ న్యూ క్రికెట్ స్టేడియంలో శనివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు చెత్త బౌలింగ్ తో చేజేతులా ఓటమిని కొనితెచ్చుకుంది. బ్యాటర్లు భారీ స్కోరు అందించినా.. బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేక చతికిలబడ్డారు. ఫలితంగా 220 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ కేవలం 18.5 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. పంజాబ్ బ్యాటర్ల ధాటికి సన్‌రైజర్స్ బౌలింగ్ లోపాలు, మైదానంలో పక్కా వ్యూహం లేమి స్పష్టంగా బయటపడ్డాయి.

### వృథా అయిన అభిషేక్ శ్రమ

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత ఇరవై ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (28 బంతుల్లో 74) క్రీజులో విధ్వంసం సృష్టించగా.. ట్రావిస్ హెడ్ (23 బంతుల్లో 38), హెన్రిచ్ క్లాసెన్ (33 బంతుల్లో 39) రాణించారు. పంజాబ్ బౌలర్లలో శశాంక్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. బ్యాటర్లు తమ బాధ్యతను అద్భుతంగా నెరవేర్చినా, ఆ స్కోరును కాపాడుకోవడంలో హైదరాబాద్ బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. సరైన లైన్, లెంగ్త్ లేకుండా బంతులు వేస్తూ పంజాబ్ బ్యాటర్లకు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

### పంజాబ్ బ్యాటర్ల ఊచకోత

భారీ లక్ష్య ఛేదనలో పంజాబ్ బ్యాటర్లు హైదరాబాద్ బౌలర్లపై ఎక్కడా కనికరం చూపలేదు. ప్రియాన్ష్ ఆర్య (20 బంతుల్లో 57), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (25 బంతుల్లో 51) అర్ధశతకాలతో చెలరేగడంతో పవర్ ప్లేలోనే సన్‌రైజర్స్ బౌలర్లు చేతులెత్తేసినట్లు కనిపించింది. భాగస్వామ్యాలను విడదీయడంలో కెప్టెన్ వ్యూహాలు ఏమాత్రం పనిచేయలేదు. శివాంగ్ కుమార్ మూడు వికెట్లు, హర్ష్ దూబే ఒక వికెట్ తీసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 69 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగుతూ సన్‌రైజర్స్ బౌలింగ్‌ను చీల్చిచెండాడాడు. చెత్త బౌలింగ్, పేలవమైన ఫీల్డింగ్ కారణంగా హైదరాబాద్ ఏడు బంతులు మిగిలి ఉండగానే పరాజయాన్ని మూటగట్టుకుంది. పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించిన శ్రేయస్ అయ్యర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి ఉస్తాద్ భగత్ సింగ్

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీనికి సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు. నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడికి పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలి పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు అన్నది చిత్ర కథ.





## ప్యారడైజ్ నుంచి కాయదు లోహర్ లుక్ విడుదల

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కాయదు లోహర్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ పోస్టర్‌లో కాయదు రెట్రో లుక్‌లో అలరిస్తుంది. ఇక 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ÷ూఒ÷ఎ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ స్లమ్ ఏరియా నేపథ్యంలో పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'రా స్టేట్‌మెంట్' గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది.




## ఓటీటీలోకి యూత్

తమిళంలో ఘనవిజయం సాధించి, తెలుగులోనూ మంచి ఆదరణ పొందిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'యూత్' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా ఈ చిత్రం ఏప్రిల్ 16, 2026 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కెన్ కరుణాస్ ఈ చిత్రంలో కథనాయకుడిగా నటించడంతో పాటు దర్శకత్వం వహించగా.. అనీషా అనిల్ కుమార్, మీనాక్షి దినేష్, ప్రియాన్షీ యాదవ్, సూరజ్ వెంజరమూడు, దేవదర్శిని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. మార్చి 19న తమిళంలో, మార్చి 27న తెలుగులో థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది ఈ చిత్రం. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఒక మధ్యతరగతి టీనేజర్ తన స్కూల్, కాలేజ్ రోజుల్లో ప్రేమ కోసం చేసే ప్రయత్నాలు, ఎదుర్కొన్న అవమానాలు, బ్రేకప్స్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఒక యువకుడు తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాల నుండి ఎలా పరిణతి చెందాడు అనే అంశాన్ని దర్శకుడు వినోదాత్మకంగా, భావోద్వేగపూరితంగా తెరకెక్కించారు.




## తమ్ముడు టైటిల్ కోసం నాగార్జున పెద్దమనసు

సినీ పరిశ్రమలో సినిమా టైటిల్స్ మారడం, ఒకరి దగ్గరున్న టైటిల్ మరొకరు తీసుకోవడం చాలా సాధారణ విషయం. ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ అయిన టైటిల్‌ను అవసరమైతే రిక్వెస్ట్ ద్వారా లేదా పరస్పర అంగీకారంతో మార్పిడి చేసుకోవడం తరచూ జరుగుతూనే ఉంటుంది. అలాంటి అరుదైన, ఆసక్తికర సంఘటనల్లో ఒకటి పవన్ కళ్యాణ్ మరియు నాగార్జున మధ్య జరిగిన 'తమ్ముడు' టైటిల్ వ్యవహారం. 'తొలిప్రేమ' భారీ విజయంతో పవన్ కళ్యాణ్ కెరీర్ ఒక్కసారిగా టాప్ గేర్‌లోకి వెళ్లింది. ఆ వెంటనే దర్శకుడు అరుణ్ ప్రసాద్ తో కలిసి ఆయన చేసిన సినిమా 'తమ్ముడు'. ఈ చిత్రం విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, పవన్‌ను యూత్ ఐకాన్‌గా మరింత బలపరిచింది. ముఖ్యంగా పాటలు, స్టైల్, యాక్షన్, కామెడీ అన్నీ కలిసి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 'తమ్ముడు' అనే టైటిల్ మొదట నాగార్జున వద్దే ఉంది. ఆయన, హరికృష్ణ కలిసి అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ఒక సినిమా చేయాలని ప్లాన్ చేశారు. ఆ కథకు 'తమ్ముడు' అనే టైటిల్‌ను నిర్ణయించి ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ కూడా చేయించారు. ఈ సమయంలో పవన్ కళ్యాణ్ సినిమా కోసం నిర్మాత శివ రామకృష్ణ ఆ టైటిల్‌ను నాగార్జునను అభ్యర్థించగా, ఆయన సానుకూలంగా స్పందించి 'తమ్ముడు' టైటిల్‌ను ఇచ్చేశారు. తరువాత నాగార్జున తన సినిమాకు 'సీతారామరాజు' అనే టైటిల్ పెట్టుకున్నారు. ఆ చిత్రం కూడా మంచి విజయాన్ని సాధించింది. ఇదే సమయంలో పవన్ నటించిన 'తమ్ముడు' కూడా భారీ హిట్ అయింది. ఇది టాలీవుడ్‌లోని సానుకూల వాతావరణాన్ని, కళాకారుల మధ్య ఉన్న పరస్పర గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.




## స్వయంభు టీజర్‌కు భారీ స్పందన

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' ఏప్రిల్ 16న విడుదల కాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.



## ఉజ్జయిని మహాకాళేశ్వరుడిని దర్శించుకున్న సారా అర్జున్

బాలీవుడ్ నటి, 'ధురంధర్' ఫేమ్ సారా అర్జున్ శనివారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని శ్రీ మహాకాళేశ్వరుడిని దర్శించుకున్నారు. ఉదయం ఉజ్జయిని మహాకాళేశ్వరుడి ఆలయానికి చేరుకున్న ఆమెకి ఆలయ సిబ్బంది ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఇక సారా మహాకాళేశ్వరుడిని దర్శించుకోవడంతో పాటు స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన భస్మ హారతి సేవలో పాల్గొంది. ఈ పవిత్ర ఆధ్యాత్మిక యాత్ర ముగించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తనకు మాటలు రావడం లేదని, స్వామివారి పిలుపు రావడం వల్లే తాను ఇక్కడికి రాగలిగానని తెలిపారు. ప్రపంచంలో దీనిని మించిన గొప్ప అనుభూతి మరొకటి లేదని, ఈ పర్యటన తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.



PRINTED, PUBLISHED AND OWNED BY **MOHAMMED IMRAN,** PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. **EDITOR : MOHAMMED IMRAN**, RNI. NO. **TELTEL/2006/16536**